# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 14 జనవరి 2026 | ■ 15 పేజీలు


15



## ప్రజా ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు

12



# ఊళ్లకు పయనం

- సంక్రాంతి నేపథ్యంలో విద్యా సంస్థలకు సెలవులు
- పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు బారులు తీరిన జనం
- బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిట
- స్వగ్రామాలకు చేరుతున్న విద్యార్థులు, ప్రజలు
- కిటకిటలాడుతున్న బస్సులు, రైల్వేస్టేషన్లు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు పల్లెబాట పట్టారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వ డంతో పిల్లా పాపలతో కలిసి శనివారం సొంతూళ్లకు ప్ర యాణమయ్యారు. దీంతో ఉదయం నుంచే రహదారులు రద్దీగా మారాయి. జాతీయ రహదారి పొడవునా జంక్షన్‌లన్నీ జామ్ అయ్యాయి. రైళ్లు నిండిపోయాయి. ఉమ్మడి జిల్లా లోని రైల్వే స్టేషన్‌ల నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు బస్టాండ్‌కు చేరడంతో బస్టాండ్ కిక్కిరిసి పోయింది. అసలే ఉచిత ప్రయాణం వల్ల మహిళలతో రద్దీగా ఉండే బస్సులు ఇప్పుడు పట్నం జనం, ఉమ్మడి జిల్లాలోని ఆదిలా బాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ఊళ్ళకు వెళ్ళే జనాలతో నిండిపోతున్నాయి.

08



# భోగ భాగ్యాల పండగ

- ఆకర్షించే లోగిళ్లు ■ మురిపించే గొబ్బెమ్మలు
- ఆకట్టుకునే రంగవల్లులు ■ హరిదాసుల కీర్తనలు
- భోగి మంటలు.. గంగిరెద్దుల ఆటాపాటలు..
- ప్రత్యేకతల కలబోత సంక్రాంతి ■ నేడు భోగి పర్వదినం

సంక్రాంతి వచ్చేసింది. ఊరు.. వాడకు నూతన సోయగాన్ని తెచ్చేసింది. ఆబాలగోపాలం ఆనందంతో కేరింతలు కొట్టే సమయం ఆసన్నమైంది. భోగి రూపంలో సంక్రాంతి అందరికీ ఆహ్వానం పలికింది. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులంతా దాదాపు వచ్చేశారు. ఎక్కడెక్కడో పనిచేసుకుంటూ జీవిస్తున్న వారంతా కుటుంబాలతో దిగిపోయారు. వారి రాకతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఏడాదిలో ఎన్ని పండుగలున్నా సంక్రాంతి ప్రత్యేకత, విశిష్టత వేరు. ఏటా మాదిరిగా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే అందరి ఇళ్లల్లో కోలాహలం నెలకొంది. పండుగలో భాగంగా తొలి రోజు భోగిని ఆనందంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు తమ ప్రాంతాల్లో భోగి మంటలు వేసుకునేందుకు ఏర్పాట్లు చేశాయి. కర్రలు, చెక్కలు సేకరించాయి. చిన్నారులు భోగి పిడకలను తయారు చేసి దండగా కట్టారు. నేడు ఉదయం 3 నుంచి 4 గంటల మధ్య భోగి మంటలు వేసుకుని పండగ వేళలను ఆస్వాదించడమే తరువాయి.

07





# 30ఏళ్ల కల.. సాకారం కానున్న వేళ

- సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు ■ నిర్మల్‌లో భారీ బహిరంగ సభ ■ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- ఆదిలాబాద్‌లో కొరటా-చనాఖా బ్యారేజీ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ
- కాంగ్రెస్ నేతల సమావేశం ■ సభను విజయవంతం చేసేందుకు చర్చ ■ జన సమీకరణలో పార్టీ శ్రేణుల బీజీ

సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 16న నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పర్యటించనున్నారు. నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీతో పాటు ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం హత్తిఘాట్ వద్ద కొరాట-చనాక బ్యారేజ్ పంప్ హౌస్ నుంచి మోటార్లను ఆన్ చేసి నీళ్లు మెయిన్ కాలువలోకి విడుదల చేయనున్నారు. అనంతరం నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు అభిలాష అభినవ్, రాజర్షి షా మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహణ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు. పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మున్సిపాలిటీల..

# అభివృద్ధికి పెద్దపీట

15

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది..
- ఓపెన్‌కాస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు పునరావాస సౌకర్యం..
- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్



1800 నాటు కోళ్లు

# మృత్యువాత

- కోళ్లకు శాపంగా మారిన శ్వాసకోశ వ్యాధి..
- కన్నెపల్లిలో రైతు రూ.10లక్షల పెట్టుబడి ఆవిరి
- ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

నాగోబా జాతరకు

# సర్వం సిద్ధం

- గిరిజన కుంభమేళాకు కేస్లాపూర్ ముస్తాబు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- 350 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన కలెక్టర్, ఎమ్మెల్యే

వివరాలు 15లో





## వాహనదారులు రోడ్డు

# భద్రత నిబంధనలు పాటించాలి

- మితిమీరిన వేగం రోడ్డు ప్రమాదాలకు కారణం
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్






**తాండూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
రహదారులపై మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందని, వాహనం నడిపేటప్పుడు నిర్దేశిత వేగాన్ని పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో తాండూర్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సుకు డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, రహదారులపై నిర్దేశిత వేగంతో మాత్రమే వాహనాలను నడపాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండి అర్హత కలిగిన వారు లైసెన్స్ పొందాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ తనిఖీలలో పట్టుబడినట్లైతే లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, అయినప్పటికీ వాహనాలు నడిపినట్లయితే సదరు వ్యక్తికి సంబంధించిన లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించాలని, కుటుంబ సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధితురాలి కూతురు స్వాతికి బెల్లంపల్లి శాసనసభ్యులు 10 వేల రూపాయలు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో మందమర్రి

**మందమర్రి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
అభివృద్ధికి ఆమడదూరంలో మందమర్రి పట్టణం ఉందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జె.రవీందర్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియా టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో పట్టణ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు జె.రవీందర్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్మిక శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ ఎన్నికలలో సమయంలో ఇచ్చిన హామీ ముఖ్యంగా మందమర్రి ఏజెన్సీ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా మారుస్తామని చెప్పి ఇప్పటి వరకు కూడా మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు జరిపించకపోవడం సిగ్గుచేటు అన్నారు.



పట్టణాభివృద్ధి పనులు విఫలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గెలిచిన వెంటనే మందమర్రి పట్టణంలోని మార్కెట్, బస్టాండ్ లో శంకుస్థాపన చేసిన సులబ్ కాంప్లెక్స్ ఇప్పటివరకు కూడా పూర్తి చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. బీఆర్ఎస్ హయంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మందమర్రి మున్సిపాలిటి అభివృద్ధికి 25.66 కోట్ల రూపాయలు నిధులు తీసుకొనివచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. ఇప్పటికైనా మందమర్రిలో మున్సిపాలిటీ ఎన్నికలు జరిగేలా ఉత్తర్వులు తీసుకురావాలన్నారు. పట్టణ అభివృద్ధి కోసం మంత్రి వద్ద మోకరిల్లకుండా పట్టణ అభివృధి కోసం పాటు పడాలని పట్టణ బిఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జె.రవీందర్, సెక్రెటరీ జనరల్ బండారు సూరిబాబు, టీబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ సంపత్ పాల్గొన్నారు.



## బహిరంగ సభ నిర్వహణకు

# పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 16వ తేదీన నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి బహిరంగ సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక, టెంట్, తగిన సంఖ్యలో కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు అవసరమైన త్రాగునీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, సభకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో అదనపు ఎస్పీ సాయికిరణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జ్ఞాన సరస్వతీ ఆలయంలో అవకతవకలు

**ముథోల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో ఆర్థిక అక్రమాలు, అవకతవకలపై విజిలెన్స్ బృందం దృష్టి సారించింది. ఆలయంలో భక్తుల నుంచి సేకరించే హుండీ ఆదాయం, దాన ధర్మాలు, పూజలు, ప్రసాదాలు వంటి ఆర్థిక లావాదేవీలను గోప్యంగా పరిశీలించిన విజిలెన్స్ బృందం, పలు విభాగాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. సాధారణ భక్తుల రూపంలో ఆలయంలోకి వచ్చిన విజిలెన్స్ అధికా రులు విచారణ గోప్యంగా జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## సమ్మక్క సారక్క జాతరలో

# దుకాణాల ఏర్పాటుకు వేలం

**మందమర్రి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
ఈనెల 28 నుంచి 31వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరగనుంది. అయితే ఈ జాతరకు మందమర్రి ఏరియా సింగరేణి యాజమాన్యం వారి ఆధ్వర్యంలో ఆర్కే-1ఏ పాల వాగు వద్ద కొబ్బరికాయలు, వెహికిల్ పార్కింగ్, బెల్లం తూకాలు, కళ్యాణ కట్ట (తలనీలాలు), ఇతర దుకా ణాలు పెట్టుకోదలచిన ఉత్సాహవంతులైన వ్యాపారస్తులు ఈనెల 17న శనివారం ఉదయం 10గంటల నుంచి మందమర్రి శ్రీ వేంకటేశ్వర ఆలయ ఆవరణలో నిర్వహించే వేలంపాటలో పాల్గొని దుకాణాలను దక్కించుకోవాలని దుకాణాలను పెట్టుకోదలచిన వారు రూ.1,000/- చెల్లించి వేలం పాటలో పాల్గొనలని సూచించారు. చెల్లించిన రూ.1000 మళ్లీ తిరిగి చెల్లించబడదని మందమర్రి ఏరియా యాజమాన్యం తెలియజేశారు.





# 1800 నాటు కోళ్లు మృత్యువాత

- శాపంగా మారిన శ్వాసకోశ వ్యాధి
- కన్నెపల్లిలో రైతు రూ.10లక్షల పెట్టుబడి ఆవిరి
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

**కన్నెపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
దాదాపు 1800కిపైగా నాటుకోళ్లు మృత్యువాత పడిన ఘటన కన్నెపల్లి మండల పరిధిలోని వీరాపూర్‌లో చోటు చేసుకుంది. మండల పరిధిలోని వీరాపూర్‌కు చెందిన సొండ్ల చందు మేర కోళ్ల ఫారంలోని 1800కిపైగా నాటు కోళ్లు మృత్యువాత పడ్డాయి. నాటు కోళ్ల పెంపకానికి ప్రత్యేక షెడ్డు నిర్మించి 2000 నాటు కోళ్లు పెంచుతున్నారు. అయితే సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు దాదాపు 1800పైగా నాటు కోళ్లు మృతి చెందాయని చందు మేర తెలిపారు. నాటు కోళ్లను రెండు నెల క్రితం సిద్దిపేట నుండి తీసుకువచ్చి తన కోళ్ల ఫారంలో పెంచుతున్నాడు. ఇదే సమయంలో ఆకస్మాత్తుగా మృత్యువాత పడటంతో దాదాపు పది లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు. ప్రభుత్వాధికారులు, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విషయంపై వెటర్నటి అసిస్టెంట్ సర్జన్ శ్వేతను వివరణ కోరగా ఈ కోళ్లు శ్వాసకోస వ్యాధి ఇబ్బందులతో మృతి చెంది ఉంటాయని ఆమె తెలిపారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి








- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి
- లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్ల అందజేత
- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లు/పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేసేందుకు పంట సాగుకు అవసరమైన వ్యవసాయ అధునాతన పరికరాలను అర్హులైన రైతులకు అందించి పంట దిగుబడి పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమం ఎస్.ఎం.ఎ.ఎం. 2025-26 లో భాగంగా అర్హులైన రైతులకు యాంత్రికరణ పరికరాలను అందించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతులు అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా లబ్ధి పొందేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులు లేని గ్రామాలకు అత్యాధునిక టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం



- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో రికార్డులు లేని (08) గ్రామాలకు అత్యాధునిక టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాదు గ్రామీణ మండలం చిచ్ధరి ఖానాపూర్ గ్రామ పంచాయతీలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 08 గ్రామాలకు సంబంధించి సరైన కాడాస్ట్రల్ మ్యాపులు, టిప్పన్లు, రికార్డులు అందుబాటులో లేవనీ, వాటిని అత్యాధునిక 'రోవర్ల మిషన్ల ద్వారా నిర్వహించడం జరుగుతుందని, తద్వారా అత్యంత కచ్చితమైన సర్వే సాధ్యమవుతుందని వివరించారు. ఈ సర్వే ద్వారా మొదట గ్రామ సరిహద్దులను, ఆ తర్వాత రైతుల వారీగా (పట్టాదారు/కాస్తుదారు) భూముల సరిహద్దులను నిర్ణయించి మ్యాపులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థులు ప్రస్తావించిన 60 ఎకరాల భూ సమస్యను, సర్వే పూర్తయిన వెంటనే ఎం.ఆర్.ఓ ద్వారా టైటిల్స్ పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. అదేవిధంగా పాఠశాలలకు ప్రహరీ గోడ, ఉపాధి హామీ పథకం కింద చిన్న చెక్ డ్యామ్ లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇంద్రవెల్లి మార్కెట్‌కు వెళ్లే రోడ్డు, విద్యుత్ స్తంభాల సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, రెగ్యులర్‌గా రీ పేమెంట్ చేసిన వారికి మాత్రమే ప్రభుత్వం అందించే రుణమాఫీ వర్తిస్తుంద న్నారు. బ్యాంకు రుణాలు ఎన్.పి.ఏ కాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, భూ సర్వే, రికార్డుల సహాయ సంచాలకులు ప్రభాకర్, తహసీల్దార్ గోవింద్, సర్వేయర్లు పాల్గొన్నారు.





## పెరిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**జన్నారం, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి క్యాలెండర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సమాజ అభివృద్ధికి సంఘ సభ్యులు అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల అధ్యక్షులు ఎంబడి సత్యం మాట్లాడుతూ, సంఘం చేపడుతున్న సామాజిక, సేవా కార్యక్రమాలు ప్రజల్లో మంచి గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో యువతను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్, రాజేందర్, చంద్ర మౌళి, తిరుపతి, మురళి, రాజమౌళి, రమేష్, అడ్వకేట్ జన్నారం మండల సంఘ నాయకులు ముత్యం సతీష్, బెడద గోపాల్, కుదిరే వెంకన్న, పేరం శ్రీనివాస్, తోట లచ్చన్న, కానిగంటి లక్ష్మణ్ వర్మ, తిరుపతి, భూమన్న, పోషన్న, దేవన్న, రాజేందర్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ షంషేర్ ఖాన్ రిమాండ్

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మంగళవారం మధ్యాహ్నం నాగ్‌పూర్ నుండి ఆదిలాబాద్‌కు వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో పంజాబ్ చౌక్ వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న రౌడీ షీటర్ షంషేర్ ఖాన్ వాగ్వాదానికి దిగి డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డ ఘటనలో ఆదిలాబాద్ పట్టణం చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన రౌడీ షీటర్ షంషేర్ ఖాన్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఒకట టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. రౌడీయిజం చేసే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ఆరు కేసులు ఉండగా, ఈ కేసుతో ఏడు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఉండగా ఆటోను సైతం సీజ్ చేసినట్టు తెలిపారు.



## కలమడుగులో అటవీ అధికారుల సోదాలు

### 14 టేకు దుంగలు స్వాధీనం

**జన్నారం, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఇంధన్‌పల్లి అటవీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ తన సిబ్బందితో కలసి కలమడుగు గ్రామంలో సోదాలు నిర్వహించగా రామడుగు వెంకటేష్‌కు చెందిన 14 టేకు దుంగలను పట్టుకోవడం జరిగిందని వీటి విలువ సుమారు అరువై వేల రూపాయలు ఉంటుందని ఎఫ్ ఆర్‌వో లక్ష్మీనారాయణ తెలిపారు. తనిఖీలలో ఎఫ్ఆర్ఓ లక్ష్మీ నారాయణ రవి, హన్మంతరావు ఎఫ్ఎస్ఓలు, ఎస్‌బిఓలు రాజేశ్వర్, తణ్వీర్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు. ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు, అనాధికార టేకు కలపను వాడాకూడదని, రెడీమెడ్ ధర్వజలు, తలుపులు వాడుకోవాలని ఆయన సూచించారు.

# బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రత్నం లక్ష్మి

## వైస్ చైర్మన్‌గా సింగర్సు రవీందర్ రావు



**బెల్లంపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాసిపేట మండల కేంద్రానికి చెందిన రత్నం లక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంతో పోటీ మధ్య బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కాసిపేట మండలానికి దక్కింది. చైర్‌పర్సన్‌తో పాటు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గాన్ని ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రకటించింది. నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా రత్నం లక్ష్మి, వైస్ చైర్మన్‌గా సింగర్సు రవీందర్ రావును నియమించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో 15 మందికి సభ్యులుగా చోటు దక్కింది. సభ్యులుగా కోమటి శ్రీనివాస్, గోలేటి సంధ్య, కమ్మరి భీమయ్య, టకిరే మల్లేష్, పంజాల శ్రీనివాస్ గౌడ్, బట్టు శ్రీనివాస్, బోరిగం జలపతి, చిన్నోజు శంకరయ్య, ఉత్తూరి సత్తయ్య, నిజాముద్దీన్ మహుమద్, మంచాల రమేష్, బెల్లంపల్లి పీఏసీ స్పెషల్ ఆఫీసర్, జిల్లా మార్కెట్ కమిటీ ఆఫీసర్, బెల్లంపల్లి ఏడీఏ, బెల్లంపల్లి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ ను సభ్యులుగా నియమించారు. రెండేళ్ల పాటు వీళ్ల పదవిలో కొనసాగనున్నారు.






## వేసవిలో నిరంతర తాగునీటి సరఫరాకు
# ప్రణాళికలు రూపొందించాలి

■ వివిధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



**ఉట్నూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

రానున్న వేసవికాలంలో ప్రతి ఇంటికి నిరంతరం తాగునీటిని అందించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు, విద్యుత్ డి.ఈ., ఎ.ఈ.లు, ఉట్నూర్ మండల కేంద్రంలోని పంచాయితీ కార్యదర్శులు, హ్యాబిటేషన్ల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లతో నీటి సమస్య, గ్రామ పరిశుభ్రత, అంతర్గత రహదారుల మరమ్మతులు, విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో నీటి సమస్యలను గుర్తించి వేసవిలో ప్రజలకు త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, సంబంధిత సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మత్తు చర్యలు చేపట్టాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, గ్రామాలలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పివిటిజి గ్రామాలలో అవసరమయ్యే బోర్ వెల్ మంజూరు అయ్యే విధంగా చూస్తామని తెలిపారు. దెబ్బతిన్న గ్రామపంచాయతీ రహదారుల మరమ్మత్తులను చేపట్టాలని శాఖ అధికారులకు తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన సూచించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారితకు
# ప్రభుత్వ ప్రోత్సాహం

**తాండూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేశ్, ఏపీఎం శ్యామల అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి రేపల్లెవాడ గ్రామంలో అభినయ గ్రామ సంఘం వారికి పెరటి కోళ్ల పెంపకం పథకం ద్వారా మంజూరైన 26 యూనిట్స్ కోళ్లను గ్రూప్ సభ్యులకు అందజేయడం జరిగింది. ఒక కోడికి రూ.130 చొప్పున సబ్సిడీ ద్వారా అందించినట్లు వారు తెలిపారు. అవి పెరిగి పెద్దగా అయిన తర్వాత వాటి అమ్మకం ద్వారా వచ్చిన లాభాలను సభ్యులందరూ పొందిన తర్వాత సబ్సిడీ కింద ఇచ్చిన కోళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలానికి మొత్తం 250 యూనిట్స్ రావడం జరిగిందని ఏపీఎం తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై వచ్చే పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంగీత, సీసీ రాజేశ్వరి, వీవీఏ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



**కుభీర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజలకు అండగా ఉండేందుకు ఎంతో కృషి చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల యువనాయకుడు పురం శెట్టి రవికుమార్ అన్నారు. మంగళవారం కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన గుర్జల రాములు అనే వ్యక్తి ఇటీవల అనరోగ్యంతో బాధపడుతుండాగా వారు ముఖ్య మంత్రి సహాయ నిది కి దరఖాస్తు చేసుకోవడంతో వారికి రూ.60వేల చెక్కు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రజలకు మెరగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అదే విదంగా ముధోల్ నియోజక వర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కి ప్రత్యేక శ్రద్ధ చూపి గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ యువ నాయకులు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకుంటాం



**మందమర్రి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్కేపీ ఉపరితల గని ప్రభావిత వార్డుల్లో ఆయన పర్యటించారు. బాధిత వార్డు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గనిలో పేలుళ్ల ధాటికి ఇల్లు పగుళ్లు తేలుతున్నాయని దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేలుళ్ల ప్రభావం తక్కువగా ఉండేలా చూడాలని సింగరేణి జీఎం రాధాకృష్ణను ఆదేశించారు. వాయు కాలుష్యం పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



## సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ గండి రామన్న దత్త సాయిబాబా ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రవి కిషన్ గౌడ్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో రూ. 2,93,877 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జ్ ఈఓ భూమయ్య, మాజీ చైర్మన్ గంగోని బూరాజ్, పలువురు సాయి భక్తులు పాల్గొన్నారు.

## రాంటెక్‌లో అంగన్‌వాడీ టీచర్‌పై దాడి

### నగదు, బంగారు ఆభరణాలు అపహరణ

**ముథోల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మనవరాలి ఉయ్యాల వేడుక కోసం సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్లిన మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్న ఘటన ముధోల్ మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ బిట్ల పెర్సెస్ కథనం ప్రకారం మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన సీడబోయిన విజయలక్ష్మీ అనే అంగన్‌వాడీ టీచర్, సోమవారం భైంసా పట్టణానికి వెళ్లారు. బస్టాండ్ సమీపంలోని సర్వీస్ పాయింట్‌లో రూ.13,000 నగదు విత్‌డ్రా చేసుకుని, వివిధ వస్తువులు కొనుగోలు చేశారు. అనంతరం ఉయ్యాల ఎక్కడ దొరుకుతుందని తోపుడు బండి వద్ద అడగగా, కూరగాయల మార్కెట్‌లో దొరుకుతుందని తెలియడంతో అక్కడికి వెళ్లి ఉయ్యాల కొనుగోలు చేశారు. తిరిగి ఆటోలో బస్టాండ్‌కు వచ్చిన సమయంలో అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు సహాయం చేస్తానంటూ పరిచయం పెంచుకుని, తాను మాచ్కల్ గ్రామానికి చెందినవాడినని, అక్కడికే వెళ్తున్నానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన విజయలక్ష్మి అతనితో కలిసి ధర్మాబాద్ వెళ్లే బస్సు ఎక్కారు. రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో మాచ్కల్ ఎక్స్ రోడ్ వద్ద మహిళ బస్సు దిగడంతో ఆ గుర్తుతెలియని వ్యక్తీ కూడా బస్సు దిగాడు. అక్కడ నిందితుడు ఆమెను చీకటి ప్రదేశంలోకి తీసుకెళ్లి, ఆమె ముఖంపై బలంగా కొట్టి, చేతిలో ఉన్న కవర్‌ను లాక్కొని పారిపోయాడు. అలాగే ఆమె మెడలో ఉన్న 2 తులల బంగారు చైన్‌ను కూడా లాక్కొన్నాడు. ఆమె వద్ద ఉన్న కవర్‌లో నగదు, మొబైల్ ఫోన్, బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డు ఉన్నట్లు తెలిసింది. బాధితురాలు సహాయం కోసం కేకలు వేయడంతో స్థానికులు స్పందించి ఆమెను భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# మేదరి సంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు సన్మానం

**ముథోల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**



భైంసా పట్టణంలో మేదరి సంఘ భవనంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య అధ్యక్షతన ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేదరి కులస్తులు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సామాజిక కార్యక్రమాల్లో సైతం పాల్గొనాలని సూచించారు. విద్య ఉద్యోగ రంగాల్లో సైతం ఉన్నతంగా ఎదగాలని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఏడ్బిడ్ గ్రామ ఉప సర్పంచ్ దూడ భూమన్న, వార్డు సభ్యులుగా సులువ రాజలింగం, ఆరే ఆదినాథ్, జోరిగల రవితేజను సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నూతన ఉద్యోగం సంపాదించిన సులువ అశోక్‌ను సైతం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరె దశరథ్, ఉపాధ్యక్షులు కనికరం శ్రీనివాస్, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎనుగందుల రాజన్న, జిల్లా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మిడి మహేశ్వర్, భైంసా మండల అధ్యక్షుడు పెండారి గంగాధర్, జిల్లా యువజన సంఘం నాయకులు పెండారి రవి, భైంసా పట్టణ కోశాధికారి కనికరం పోశట్టి, నిర్మల్ కోశాధికారి సాయికుమార్, నాయకులు జోరీగల నారాయణ, సూర్య ప్రసాద్, ప్రవీణ్, కనికరం ప్రవీణ్, ముత్తన్న, భోజన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ఆసిఫాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

వాహనదారులు ట్రాఫిక్ నిబంధ నలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ వహీదుద్దీన్ అన్నారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మోతుగూడ గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని చెప్పారు. వాటికి ప్రధాన కారణం నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమేనని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పక వాడాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో సీఐ బాలాజీ, ఎస్సై ఉదయ్‌కిరణ్, సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్(యు) మండలంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జైనూర్ సీఐ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని చెప్పారు. కారు, ఇతర వాహనాలు నడిపే వారు సీటుబెల్ట్ వినియోగించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. వేగ నియంత్రణ పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ వాహనం నడపకూడదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి విలువైన ప్రాణాలను



కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఓంప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, రాయిసెంటర్ సర్‌మెడి ఆత్రం ఆనంద్‌రావు, నాయకులు ఆంధ్రయ్య, ఆత్రంభీర్‌షా తదితరులు పాల్గొన్నారు. రెబ్బెన మండలం గంగాపూర్ గారమంలో ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వాటికి ప్రధాన కారణం నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమేనని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పక వాడాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశంచారి, ఉప సర్పంచ్ ఇస్తారి తదితరులు పాల్గొన్నారు. లింగాపూర్ మండల కేంద్రంలో మంగళవారం లింగాపూర్ ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత నిబంధనలపై గ్రామస్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగన్న మాట్లాడుతూ వేగం తోనే విలువైన ప్రాణాలను వాహనదారులు కోల్పోతున్నారని అన్నారు. వేగం కన్న ప్రాణం మిన్న అనే విషయాన్ని వాహనదారులు గుర్తించుకోవాలని చెప్పారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదాల్లో గాయపడితే ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో లింగాపూర్ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు, కెరమెరి మండలం కోఠారి గ్రామంలో మంగళవారం సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్ ల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మరణించిన మర్సుకోల మహేష్ కుటుంబానికి 25 కిలోల బియ్యంను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు పాల్గొన్నారు. కౌటాల, చింతలమానేపల్లి మండల కేంద్రాల్లో మంగళవారం సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థుకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై సురేష్ గ్రామస్థుకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.



## రైతులకు చివరి ఆయకట్టుకు నీరివ్వాలి

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

**లక్షెట్టిపేట, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

రైతులు సాగు చేస్తున్న యాసంగి పంటకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన బీజేపీ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల రైతులతో కలిసి లక్షెట్టిపేట ఊత్కూర్ చౌరస్తాలో రాస్తా రోకో చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట కోసం రైతులు నారు పోసి ఇప్పటికి 50రోజులు కావస్తుందని ఇప్పటికి గూడెం లిఫ్ట నుంచినీరు ఇవ్వకపోవడంతో నారు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ డీఈ ఈనెల 16లోగా పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనగందుల కృష్ణమూర్తి, హరిగోపాల్‌రావు, రాజయ్య, రవిగౌడ్, స్వామిరెడ్డి, కిషన్, సంతోష్, అశ్విన్, సత్తయ్య, సురేష్, సతీష్, లచ్చన్న, కిషన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీ కార్మికుడి బలవన్మరణం

**వాంకిడి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సంతోష్ గిరి గోస్వామి (29) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాంకిడి మండలంలోని ఎక్సైజ్ చెక్ పోస్టు సమీపంలోని ఓ ఇటుక బట్టీలో భార్యభర్తలు ఇద్దరు కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం రాత్రి భార్య భర్తలిద్దరూ మధ్య గొడవ జరగడంతో సంతోష్ మనస్తాపం చెంది తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిరక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ తగాదా లతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## రేవంతన్న బస్తీబాట ప్రారంభం

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంతన్న బస్తీబాట కార్య క్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో మున్సిపల్ పరిధిలోనీ వార్డులలో చేపట్టే పాదయాత్రకు మంగళవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే 7, 8 వార్డులలోని కేఆర్కే కాలనీలో పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. తాను ఎల్లప్పుడు ఆదిలాబాద్ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బాదన్ గంగన్న, నాయకులు బాదన్ గంగన్న, గంగాధర్, బండారి సతీష్, సంద నర్సింగ్, కలాల శ్రీనివాస్, లోక ప్రవీణ్ రెడ్డి, జాఫర్, ఇమ్రాన్, రామ్ కుమార్, లక్ష్మణ్, శాంతన్ రావు, భూపెల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**ఆసిఫాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**



దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట భవన సమావేశ మందిరంలో మంగళవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్‌తో కలిసి జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమాలు 2018 ప్రకారంజిల్లాలో అమలు అవుతున్న పథకాలు, దివ్యాంగులకు సంబంధించిన విద్య, ఉపాధి, వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దివ్యాంగుల చిత్రాలపై నిపుణులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. ప్రభుత్వ పథకాలలో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ లక్ష్మినారాయణ, డీపీఎంలు రామకృష్ణ, యాదగిరి, డీఎస్పీ వహిదుద్దీన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర జోషి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసిన న్యాయవాది అజహరుద్దీన్

**ఉట్నూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ పట్టణానికి చెందిన న్యాయవాది,కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మహమ్మద్ అజహరుద్దీన్ పట్టణ వార్డు నెంబర్ 14కు చెందిన తన అనచరులతో కలిసి మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గం శాసన సభ్యులు, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్‌ను ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మహమ్మద్ మజారుద్దీన్, సయ్యద్ అజీమ్, మహమ్మద్ సోహైల్, అర్షద్ మరియు ఖానాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు షౌకత్ తదితరులు ఉన్నారు.



## వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా చూడాలి

### కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

వేసవిలో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి మిషన్ భగీరథ, ఇంట్రా, గ్రిడ్ ఇంజనీరింగ్ అధికారులతో వేసవిలో నిరంతర తాగునీటి సరఫరాకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ సేవ అంకలన్ పథకం కింద జిల్లాలో 15 గ్రామపంచాయతీలు ఎంపికయ్యాయన్నారు. ఈ నెల 20వ తేదీన సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి తాగునీటిపై చర్చించాలని తెలిపారు. ఫిబ్రవరిలో ప్రతి తాగునీటి వనరును తనిఖీలు నిర్వహించాలని, వచ్చే వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీటిని అందించే విధంగా గ్రామాల్లో సర్పంచ్‌ల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో భిక్షపతి, ఇంజనీరింగ్ అధికారులు సిద్దిక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**చైనా మాంజాతో పక్షులకు ప్రమాదం...**

చైనా మాంజా వినియోగం వల్ల పక్షులు, ఇతర జీవులకు ప్రమాదం కలుగులుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం అటవీ జిల్లా అదికారి నీరజ్‌కుమార్, అదనపు కలెక్టర్ డేవిడ్, అటవీ అదికారులు అప్పయ్యతో కలిసి చైనా మాంజాతో కలిగే అనర్థాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా మాంజాతో కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయలను మాత్రమే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## శబరిమలలో నేడు
# మకర జ్యోతి దర్శనం

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
శబరిమలలో నేడు జనవరి 14న, మకర జ్యోతి దర్శనం ఇవ్వనుంది. సాయంత్రం 6:25 నుండి 6:55 గంటల మధ్య పొన్నాంబల కొండపై ఈ జ్యోతి కనిపించనుంది. భక్తుల విశ్వాసం ప్రకారం, సాక్షాత్తు మణికంఠుడే ఈ జ్యోతి రూపంలో దర్శనమిస్తాడు. రేపు వర్చువల్ క్యూ ద్వారా కేవలం 30,000 మంది భక్తులకు మాత్రమే దర్శనానికి అనుమతి ఉంది. దేవస్వం బోర్డు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. జనవరి 19 రాత్రి వరకు అయ్యప్ప దర్శనానికి అవకాశం ఉంటుంది, 20వ తేదీన ఆలయం మూసివేయనున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో
# జనసేన పార్టీ పోటీ



**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంతెన సంపత్ కుమార్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ప్రజారాజ్యం పార్టీని తెలంగాణ రాష్ట్రంలోని ఆదరించిన ప్రాంతం నిర్మలని అప్పట్లో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పార్టీ తరఫున గెలిపించిన విషయాన్ని గుర్తు చేశారు ఎన్నికల్లో మున్సిపల్‌లో జనసేన పోటీలో ఉంటారని త్వరలో అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, మహేష్, రాజేశ్వర్, రమణ దశరథ్, సుధాకర్, ప్రవీణ్, ముత్యం పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు బీభత్సం
## ఒడ్డుగూడా వెనుక నుంచి ఢీ
## పలువురికి గాయాలు

**బెజ్జూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా మండలం ఒడ్డుగూడా సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దహేగం మండలం ఒడ్డుగూడా నుండి పెంచికల్‌పేట్ వైపు నుండి బైక్‌పై వస్తుండగా, ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బెజ్జూరు మండలం ఎలుక పెల్లి బి గ్రామానికి చెందిన చ టారి రాములు, చింతలమానపల్లి మండలం ధరం పెల్లి గ్రామానికి చెందిన బోర్ల రవి, బోర్ల బుజ్జిలను కాగజ్‌నగర్ నుండి దహేగాం మండలం కంచవెల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనక నుండి ఢీ కొట్టింది. దీంతో చటారి రాములు కుడికాలు విరిగిపోయింది. బోర్ల రవికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు వెనక నుండి బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు బాధితులు తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం
## ట్రయల్ రన్ కోసం సీఎం రావడం హాస్యాస్పదం
## మాజీ మంత్రి జోగు రామన్న




**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
అన్ని వర్గాలకు మోసపూరిత హామీతో పాటు, రైతులకు రైతుబంధు ఎగగొట్టడమే కాకుండా, తెలంగాణ ప్రభుత్వ కల్పించిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 16న చేపట్టే ఆదిలాబాద్ పర్యటనను అడ్డుకుంటామని మాజీ మంత్రి జోగు రామన్న హెచ్చరించారు. మంగళవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోగు రామన్న మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డికి రైతుల బాధలు పట్టవు కానీ, ఎన్నికలు రాగానే కానుకలు గుర్తుకు వస్తున్నాయన్నారు. గడచిన రెండు సంవత్సరాల కాలంలో సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు చేసిందేమీ లేదు, కానీ చనాక కొరట బ్యారేజ్ ట్రయల్ రన్ పేరుతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటన చేయడం రైతులు గమనిస్తున్నారన్నారు. ఎన్నికలు వస్తేనే రైతుబంధు వేస్తున్నారు తప్ప, రైతులకు కావాల్సిన యూరియా రైతుబంధు, కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైతుందన్నారు. ఎన్నికల కోసం చనాక కోరాట ప్రాజెక్టు ట్రయల్ రన్ కోసం సీఎం రావడం హాస్యస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసం నర్సింగరావు, గంద్రత్ రమేష్, మెట్టు ప్రహ్లాద్, సతీష్, బుట్టి శివ, తిరుపతి, పాశం రాఘవేంద్ర, మహేష్, సదుల్ల, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం



## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**వాంకిడి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పేదల పొట్ట కొడుతోందని ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆమె పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షానే ఉంటుందని ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన నాయకుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని యథతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ--రామ్ జీ చట్టం వల్ల గ్రామీణ కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉధృత పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పోరాటాల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొని ప్రజల్లోకి వెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

## గ్రామపంచాయతీ
# కార్మికుల వేతనాల చెల్లింపు

**వాంకిడి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మండలం బంబార గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా బెండరే కృష్ణాజీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపునకు సంబంధించిన చెక్కుపై మంగళవారం తొలి సంతకం చేశారు. గ్రామ పరిపాలనలో భాగంగా కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామపంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, ప్రజలకు మౌలిక సేవలు అందించడంలో వారి సేవలు అభినందనీయమని అన్నారు. కార్మికుల సమస్యలను సకాలంలో పరిష్కరించి, వారి హక్కులు, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తామని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాడి సంతోష్, గ్రామపంచాయతీ కార్యదర్శి దుర్గం ధర్మయ్య, గ్రామపంచాయతీ సభ్యులు, ఇతర సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.





# సీఎం కప్‌పై అవగాహన ర్యాలీ

**వాంకిడి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కప్ క్రీడలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జ్యోత్స్న ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలో యువకులతో, అధికారులతో కలిసి ప్రచార ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఎం కప్ క్రీడల ప్రాముఖ్యత, పోటీల్లో పాల్గొనే విధానం, నమోదు ప్రక్రియ గురించి ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్న యువకులకు ఎంపీడీవో వివరించారు. ఆమె మాట్లాడుతూ, క్రీడలు యువతలో ఆరోగ్యం, ఉత్సా హాన్ని పెంపొందిస్తాయని వివరించారు. సీఎం కప్ క్రీడల ద్వారా మండల యువకులు రాష్ట్ర స్థాయిలో పోటీపడి పతకాలు సాధించే అవకాశం ఉందన్నారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి యువకులు పాల్గొ నేలా అధికారులు గ్రామీణ యువతను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చునార్కర్ సతీష్, ఎంపీఓ ఖాజా అజిజు ద్దీన్, కార్యాలయ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి
# ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లి మండలం దొడందా గ్రామ పంచాయతీ పరిధిలోని చిలాటిగూడా గ్రామ సమీప అటవీ ప్రాంతంలో కొలువుదీరిన జంగు బాయి దేవతను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జంగున్ బుయారి ఆలయ అభివృద్ధి తో పాటు కరెంట్ సౌకర్యం, షెడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నీటి కోసం చెక్ డ్యామ్ ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరగా అధికారులతో మాట్లాడి చర్చిస్తామని తెలిపారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముకడే ఉత్తమ్, ఆలయ కమిటి చైర్మన్ తుమ్రం ప్రభాస్, కాంగ్రెస్ నాయకులు ఎండీ మసూద్,జితేందర్, తుమ్రం దన్ను తదితరులు ఉన్నారు.









# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## సదర్‌మాట్, కొరటా-చనాఖా బ్యారేజీల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

- నిర్మల్‌లో భారీ బహిరంగ సభ..
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు
- ఆదిలాబాద్‌లో కొరటా-చనాఖా బ్యారేజీ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీలు..
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో సీఎం సభా ఏర్పాట్లపై సన్నాహాలు
- కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం..
- సభను విజయవంతం చేసేందుకు చర్చ..
- భారీ జన సమీకరణలో పార్టీ శ్రేణుల బిజీబిజీ



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఈ నెల 16న ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం భోరాజ్ మండలం హాతీఘాట్ గ్రామంలోని చనాక-కోరాట బ్యారేజీ పంప్ హౌస్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చనాక-కోరాట ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్య మంత్రి హాజరవుతున్నందున ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రతా, ప్రోటోకాల్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ వద్ద అగ్నిమాపక, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సాఫీగా సాగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, భద్రత కారణాల దృష్ట్యా గుర్తింపు కార్డులతో పాటు పాస్‌లు ఉన్న వారిని అనుమతించడం జరుగుతుందని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందుకు గ్రామస్తులు, అధికారులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంతకుముందు కలెక్టర్, ఎస్పీలు హెలిపాడ్ ప్రాంతాన్ని, పంప్ హౌస్, ప్రధాన కాలువ, ప్రధాన కాలువ డెలివరీ సిస్టమ్ వద్ద జరగబోయే పూజా కార్యక్రమ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఆదిలాబాద్ ఆర్డీఓ స్రవంతి, నీటి పారుదల శాఖ ఎస్ఈ విశ్వ కళ్యాణ్, ఇంజనీర్లు, తహసీల్దార్లు రాజేశ్వరి, శ్రీనివాస్, అగ్ని మాపక, వైద్య, రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌లో సీఎం పర్యటన అరగంటే..**

జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ కేవలం అరగంట మాత్రమే ఉండనున్నారు. ఈనెల 16న మధ్యాహ్నం 12గంటలకు హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా జిల్లాలోని భోరజ్ మండలం హత్తిఘాట్‌కు నేరుగా రానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయన వెంట జిల్లాలో పర్యటించనున్నారు. కొరాట-చనాక బ్యారేజ్‌కు కొద్ది దూరంలో హత్తిఘాట్ వద్ద నిర్మించిన పంప్ హౌస్ నుంచి మోటార్లను ఆన్ చేసి నీళ్లు మెయిన్ కాలువలోకి విడుదల చేయనున్నారు. ఆ తర్వాత అక్కడే పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎలాంటి బహిరంగ సభ ఏర్పాటు చే యలేదు. 12.30 గంటలకు ఆయన పర్యటన పూర్తవుతుంది. ఇక్కడి నుంచి నిర్మల్ జిల్లాకు బయల్దేరి వెళ్తారు. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం హత్తిఘాట్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. హెలిప్యాడ్ ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేశ్ జాదవ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి, సీనియర్ నేతలు గండ్రత్ సుజాత, సంజీవ రెడ్డి, గ్రంథలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య హత్తి ఘాట్ వద్ద పంప్ హౌస్‌ను పరిశీలించారు. అయితే, హత్తిఘాట్ వద్ద పంప్ హౌస్ నుంచి నీళ్లు విడుదల చేసే కార్యక్రమ కవరేజ్‌కు స్థలాభావం, భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించినట్లు సీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి.

**సెంటిమెంట్‌గా సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన...**

టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత రేవంత్ రెడ్డి అప్పట్లో జిల్లాలోని ఇంద్రవెల్లిలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యారు. సభ సక్సెస్ కావడంతో పార్టీలో ఉత్సాహం నింపింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ఇలా జిల్లాపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. 2024 ఫిబ్రవరిలో మొదటిసారి సీఎం హోదాలో ఆయన ఇంద్రవెల్లికి వచ్చారు. నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా కేంద్రానికి ప్రధాన మంత్రి మోదీ వచ్చినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇక్కడ ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇక సర్పంచ్ ఎన్నికలకు ముందు గత డిసెంబర్‌లో ఆయన రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. నెల తర్వాత మళ్లీ ఆయన జిల్లాకు వస్తున్నారు. ఒకవిధంగా ఆయన తన పర్యటనను సెంటిమెంట్‌గా జిల్లా నుంచి కొనసాగిస్తున్నారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనుండగా, ఆదిలాబాద్‌కు మరోసారి రానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**సీఎం పర్యటన విజయవంతం చేయండి...**

సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జీ కంది శ్రీనివాసరెడ్డి కోరారు. ఈనెల 16న భోరజ్ మండలం కొరటా-చెనకా బ్యారేజీ పంప్ హౌజ్ ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు. మంగళవారం ఆయనతోపాటు డీసీసీ అధ్యక్షుడు నరేశ్ జాదవ్ కాంగ్రెస్ నాయకులు బ్యారేజీ పంప్ హౌజ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రంథలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, టీపీసీసీ మాజీ జన రల్ సెక్రెటరీ జనరల్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, బోథ్ మాజీ మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ, ఐఎన్టీయూ సీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ తదితరులు ఉన్నారు.



















# ఊరంతా శోభ

సంక్రాంతి రోజుల్లో ముగ్గులు / రంగవల్లులు ప్రధానం. ఇవి లేకుండా ఏ వాకిలీ మీకు స్వాగతం పలకదు. ఏ లోగిలీ ఆహ్వానించదు. భోగి మంటలు వేసుకుని.. చిన్నారులకు పండ్లు పోసి ఆశీర్వదించిన పెద్దలు.. ఉత్సాహంగా సంక్రాంతి జరుపుకుంటున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన కుటుంబీకుల మధ్య... ఆనంద సంతోషాలతో.. అలనాటి ముచ్చట్లను పంచుకుంటూ, కొత్త రుచులు ఆరగిస్తూ.. సరదాగా గడిపేస్తున్నారు.

- ఆకర్షించే లోగిళ్లు
- మురిపించే గొబ్బెమ్మలు
- ఆకట్టుకునే రంగవల్లులు
- భోగి పళ్లు.. హరిదాసులు.. కీర్తనలు
- భోగిమంటలు.. గంగిరెద్దులు..
- ప్రత్యేకతల కలబోత సంక్రాంతి

## ముగ్గులు

రాళ్లు, రప్పలూ లేకుండా ఒక పద్ధతిలో అలకబడిన నేల, మేఘాలు లేని ఆకాశానికి సంకేతం. ఒక పద్ధతిలో పెట్టబడు చుక్కలు రాత్రి వేళ కనిపించే నక్షత్రాలకు సంకేతం. చుక్కలచుట్టూ తిరుగుతూ చుక్కలను గళ్ళలో ఇమిడ్చే ముగ్గు ఖగోళంలో ఎప్పుడికప్పుడు కనిపించే మార్పులకు సంకేతం. ఎంత పెద్దదైనా చిన్నదైనా ముగ్గు మధ్య గడిలో పెట్టే చుక్క సూర్యు స్థానానికి సంకేతం. ఇంకొక దృక్పథంలో గీతలు స్థితశక్తికి (స్టాటిక్ ఫోర్స్), చుక్కలుగతిశక్తి (డైనమిక్ ఫోర్స్)కు సంకేతాలని, ముగ్గులు శ్రీ చక్ర సమర్పనా ప్రతీకలని శక్తి త్వత్తవేత్తలు అంటారు.. ఇక వివిధ ఆకారాలతోవేసే ముగ్గులు విల్లు ఆకారం పునర్వసు నక్షత్రానికీ, పుష్పం పుష్యమీ నక్షత్రానికీ పాము ఆకారం ఆశ్లేషకూ, మేక, ఎద్దు, పీత, సింహం, ఇలాంటివి మేష, వృషభ, మిధున, కర్కాటక రాసులకూ, తొమ్మిది గడుల ముగ్గు నవగ్రహాలుకూ సంకేతాలుగా చెబుతుంటారు.

## గొబ్బెమ్మలు

పెద్ద వయసు మహిళలు ముగ్గులు పెడుతుంటే చిన్న వయసు ఆడపిల్లలు ఆవు పేడతో చేసి పెట్టే గొబ్బెమ్మలు కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలకు సంకేతం. ఈ ముద్దల తలమీద కనుపించే రంగుల పూలరేకులు, పసుపు కుంకుమలు ఆ గోపికలందరూ పుణ్య మహిళలకు సంకేతం. ఆ గోపికా మహిళల రూపాలకు సంకేతమే గోపీ, బొమ్మలు. గొబ్బెమ్మలు. మధ్య ఉండే పెద్ద గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం. సంక్రాంతి రోజులలో వీటి చుట్టూ తిరుగుతూ పాటలు పడుతూ నృత్యం చేసే బాలికలంతా కృష్ణ భక్తి తమకూ కలగాలని ప్రార్థిస్తుంటారు. దీనిని సందే గొబ్బెమ్మ అంటారు. గొబ్బెమ్మలు పొద్దున పూట ముగ్గులో ఉంచి, దానిపై గుమ్మడి పూలుతో అలంకారం చేస్తే చాలా అందంగా ఉంటుంది.

## గాలిపటాలు

సంక్రాంతి పండుగ పిల్లలందరికి చాలా ప్రత్యేకమైన పండుగ, పిల్లలు అరోజు పొద్దిన నుండి సాయంత్రం వరకు గాలిపటాలు ఎగురవేస్తూ గడుపుతారు.



## గంగిరెద్దు

ముందు వెనుకల చెరో ప్రమదునితో (శివ గణం) ఎత్తైన మూపురం శివలింగాకృతిని గుర్తుచేస్తూ శివునితో సహా తను సంక్రాంతి సంబరాలకు హాజరయ్యానని చెప్పే సంకేతం గంగిరెద్దు. ఆవు లేదా ఎద్దు ఇంటి ముందు ముగ్గులో నిలిచిందంటే ఆనేల ధర్మబద్ధ మైనదని అర్థం. ఆ నేల ఆవుకి సంకేతం, ఆనేల నుండి వచ్చిన పంటకు సంకేతం ముంగిట నిలిచిన వృషభం. మీరు చేసే దానమంతా ధర్మబద్ధమేనంటూ దాన్ని తాము ఆమోదిస్తున్నామని ఇంటింటికీ తిరుగుతుంటారు వృషభసహిత శంకర పరివారం.



## హరిదాసు

గొబ్బిళ్లతో ఇంటి ముందరి భాగాన్ని అలంకరించి హరిని కీర్తించే భక్తులకు సాక్షాత్ శ్రీకృష్ణుడే హరిదాసు రూపంలో వస్తాడని నమ్మకం. ఆయన తలమీద మంచి గుమ్మడి కాయ ఆకారంలో ఉండే ఓ పాత్ర గుండ్రముగా ఉండే భూమికి సంకేతం దాన్ని తలమీద పెట్టుకొని ఉండటం శ్రీ హరి అయిన తానే భూమిని ఉద్ధరిస్తున్నానని అని చెప్పే దానికి సంకేతం. హరినామ కీర్తన చేస్తూ రావడం తను ఏ భోగాలకూ లొంగనని, కేవలం హరినామ సంకీర్తనకే వచ్చే వాడిననీ తనకు తమపర భేదాలు లేవనీ అందుకే ప్రతి ఇంటికీ తిరుగుతూ వస్తాడనే సంకేతం.

## భోగిపళ్లు

భోగి పండ్లు అంటే రేగుపండ్లు. ఇది సూర్యునికి ప్రీతిపాత్రమైన పండుగ. సూర్యుని రూపం, రంగు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలను కలిపి పిల్లల తలపై పోస్తారు. సూర్య భగవానుని అనుగ్రహం పిల్లలపై ప్రసరించి ఆరోగ్యం కలగాలనే సంకేతంతో ఇలా పోస్తారు.

## సంక్రాంతి విశేషాలు

- హిందువుల పండుగలలో సంక్రాంతి మాత్రమే సౌరగమనాన్ని అనుసరించి వస్తుంది.
- సంక్రాంతి ప్రతీ సంవత్సరం ఒకే తేదీన వస్తుంది. మిగిలిన పండుగలన్నీ భారతీయ సాంప్రదాయం ప్రకారం చాంద్రమానాన్ని అనుసరించి వస్తాయి.
- పవిత్రమైన ఉత్తరాయణ పుణ్యకాలంలో మరణించినవారు స్వర్గానికి వెళ్తారని హిందువుల నమ్మకం. సంక్రాంతితో ఉత్తరాయణం మొదలవుతుంది. భారతంలో స్వచ్ఛంద మరణం కలిగిన భీష్మాచార్యుడు సంక్రాంతి పర్వదినం వరకూ ఆగి, ఉత్తరాయణంలో రథసప్తమి (మాఘ శుద్ధ సప్తమి) నాడు ప్రారంభించి, రోజునకు ఒక్కొక్క ప్రాణం చొప్పున వదులుతూ, చివరకు భీష్మఏకాదశి మాఘ శుద్ధ ఏకాదశి నాడు ఐదవ ప్రాణాన్ని కూడా వదిలి, తనువు చాలించాడు.
- ఆది శంకరాచార్యుడు ఈ రోజునే సన్యాసం పుచ్చుకున్నాడు.
- సినీ నిర్మాతలు తమ సినిమాలను సంక్రాంతి సమయంలోనే విడుదల చేయటం శుభప్రదంగా భావిస్తారు.
- పుష్యమాసంలో వైష్ణవ భక్తులు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి సంక్రాంతి రోజున గోదాకల్యాణం జరిపి తమ వ్రతాన్ని పరిసమాప్తి చేస్తారు.
- మూడు రోజులలో పూర్తవుతూ అందరికీ ఆనందాన్ని పంచే పండుగను ఘనంగా సాగనంపేందుకు పుట్టినదే రథం ముగ్గు. అందరూ ఒకరికి ఒకరు తోడుంటూ కలసి సహజీవనం సాగించాలి అనే సంకేతాలతో ఒక రథం ముగ్గు తాడును మరొక ఇంటి వారి ముగ్గుతో కలుపుతూ పోతూంటారు.



## భోగిమంటలు

మూడురోజులపాటు సాగే సంక్రాంతి పండుగలో మొదటి రోజున నాలుగు మార్గాల కూడలిలో వేయబడే పెద్ద మంట. అప్పటి నుండి ఇంతకంటే మరింత వేడితో ఉత్తరాయణ సూర్యుడు రాబోతున్నడనే సంకేతం. దక్షణాయం లో ఉండే నిద్ర బద్ధకంతో సహా దగ్ధం చేయాలనే సంకేతంతో చీకటితోనే బోగిమంట వేస్తారు. ఇంట్లో ఉండే పాత కలపసామానులు, వస్తువులు, ఎండుకొమ్మలు లాంటివి బోగి మంటలో వేసి తగులబెడుతారు. వీటన్నిటినీ దారిద్ర్య చిహ్నాలుగా బావించి తగులబెట్టాలంటారు. వేసవిలో వేడికి తగులబడే వాటిని గుర్తించాలనే మరొక సంకేతం కూడా ఇందులో ఇమిడి ఉంది.

## తిల తర్పణం

సంవత్సరంలో మిగిలిన రోజులలో నల్ల నువ్వులు వాడరు. కాని సంక్రాంతి పర్వదినాన మాత్రం నల్లనువ్వులతో మరణించిన పిత్రుదేవతలందరికీ తర్పణములివ్వడం చేస్తుంటారు. దీన్నే పెద్దలకు పెట్టుకోవడం అంటుంటారు. సంక్రాంతి పర్వదినాల్లో వారి వారి ఆచార సంప్రదాయాలను అనుసరించి దీన్ని చేస్తుంటారు. ఈ రోజు బూడిద గుమ్మడి కాయ దానం చేస్తే మంచిదని నమ్మకం.



## యామీ గౌతమ్‌కు సమంత సెల్యూట్..

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ (తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచయమే), ఇమ్రాన్ హష్మీ జంటగా నటించిన 'హక్' సినిమా గత ఏడాది విడుదలై, ప్రేక్షకుల మన్ననలు పొందింది. ప్రస్తుతం ఈ చిత్రం నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రంపై టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత స్పందిస్తూ ప్రశంసలు కురిపించింది. 'హక్' చిత్రాన్ని చూసి తాను ఎంతో భావోద్వేగానికి గురయ్యానని సమంత చెప్పింది. సినిమా చూడటం అయిపోయిన వెంటనే... దీని గురించి కొన్ని మాటలు రాయాలనిపించిందని తెలిపింది. ఆ సినిమాలోని సన్నివేశాలను చూసి తాను భావోద్వేగానికి గురయ్యానని తెలిపింది. ఆ భావోద్వేగాలను కొంచెం కూడా కోల్పోకూడదని తాను అనుకున్నానని చెప్పింది. లోతైన మానవీయ కోణంలో సినిమాను తెరకెక్కించారని... పక్షపాతం లేకుండా ఎవరినీ తక్కువ చేయకుండా చూపించారని తెలిపింది. యామీ గౌతమ్ ఈ కథకు ప్రాణం పోసిందని ప్రశంసించింది.

## మా పరిధిలోకి రాదు అంటున్న సెన్సార్ బోర్డ్..



కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. అంతేకాకుండా, దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. అయితే ఈ వివాదంపై సెన్సార్ బోర్డు తాజాగా స్పందించింది. యూట్యూబ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో విడుదలయ్యే కంటెంట్‌కు సెన్సార్ సర్టిఫికేషన్ అవసరం లేదని తెలిపింది. కేవలం థియేటర్లలో ప్రదర్శించే టీజర్లు, సినిమాలకు మాత్రమే సెన్సార్ అనుమతి తప్పనిసరని, 'టాక్సిక్' టీజర్ నేరుగా డిజిటల్ మాధ్యమాల్లో రావడంతో అది తమ పరిధిలోకి రాదని వెల్లడించింది. అంతేకాకుండా ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి కంటెంట్ సెన్సార్ కోసం తమ వద్దకు రాలేదని బోర్డు వెల్లడించింది.

## సంక్రాంతి కానుకగా ఎల్లమ్మ గ్లింప్స్ రిలీజ్!



'బలగం' చిత్రంతో సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు వేణు యెల్దండి తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా అప్‌డేట్‌ను పంచుకున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 15 సాయంత్రం 4:05 గంటలకు ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సినిమాకు 'ఎల్లమ్మ' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. తెలంగాణ మట్టి వాసన, సంస్కృతి నేపథ్యంలో 'బలగం'ను అద్భుతంగా ఆవిష్కరించిన వేణు ఈసారి కూడా గ్రామీణ నేపథ్యంలోనే మరో వైవిధ్యమైన కథను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ నటించనున్నారని, ఇది ఆయనకు వెండితెరపై నటుడిగా మొదటి సినిమా కాబోతోందని సమాచారం. ఇక కథానాయికగా కీర్తి సురేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ గ్లింప్స్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్‌లో ఎవరెవరు అనేది తెలియాలంటే సంక్రాంతి వరకు వెయిట్ చేయాల్సిందే.

## వీఐపీ సంస్కృతిపై గళమెత్తిన నటి



రాజకీయ నేతల వీఐపీ సంస్కృతిపై ప్రముఖ నటి ప్రణీత సుభాష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓ రాజకీయ నేత కదలికల కోసం రోడ్లను మూసివేయడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె మండిపడ్డారు. ఈ పరిస్థితిని ఉద్దేశించి 'This is frustrating' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇటీవల బయటకు వెళ్లిన సమయంలో బెంగళూరులోని సిటీ సెంటర్, కోరమంగళ ప్రాంతాల వైపు వెళ్లే రోడ్లను వీఐపీ కదలికల కారణంగా మూసివేయడంతో తీవ్ర అసౌకర్యం ఎదురైందని ప్రణీత తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రజల రోజువారీ జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. రాజకీయ నాయకుల వీఐపీ జీవనశైలి దేశాభివృద్ధికి ఏమాత్రం దోహదపడటం లేదని, దానికి బదులుగా మరిన్ని సమస్యలను సృష్టిస్తున్నాయని ప్రణీత స్పష్టం చేశారు.ఇలాంటి వ్యవస్థ కొనసాగితే దేశం ముందుకు వెళ్లడం కష్టమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విటర్)లో ప్రణీత సుభాష్ స్పందిస్తూ, 'సిటీ సెంటర్, కోరమంగళ వైపు వెళ్లే రోడ్లు వీఐపీ కదలికల కోసం మూసివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ నాయకుల వీఐపీ జీవితాలే దేశాన్ని ముందుకు నడిపించకుండా వెనక్కి నెట్టుతున్నాయి' అని ట్వీట్ చేశారు. ప్రణీత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. వీఐపీ సంస్కృతిపై ఆమె చేసిన వ్యాఖ్యలకు పలువురు నెటిజన్లు మద్దతు తెలిపారు.




సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు ..పల్లెల్లో సందడి పెరుగుతూ పోతుంటుంది. ఇక పట్నాల్లో ..టౌన్లలో సినిమాల సందడి ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. అందువల్లనే సంక్రాంతిని సినిమాల పండుగగా కూడా చెప్పుకుంటూ ఉంటారు. అలా ఈ సంక్రాంతికి ఇప్పటికే 'రాజా సాబ్' .. 'మన శంకర వరప్రసాద్' .. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలు థియేటర్లకు వచ్చాయి. ఇక రేపు 'అనగనగా ఒక రాజు' సినిమా ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది. ఈ సినిమాతో దర్శకుడిగా 'మారి' పరిచయమవుతున్నాడు. నవీన్ పొలిశెట్టి మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ సినిమాలో, కీలకమైన పాత్రలో రావు రమేశ్ కనిపించనున్నాడు. నవీన్ పొలిశెట్టికి మంచి క్రేజ్ ఉన్నప్పటికీ, కథల విషయంలో .. పాత్రల విషయంలో చాలా కేర్ తీసుకుని మరీ ఎంచుకుంటున్నాడు. అందువలన ఈ కథలో విషయం కాస్త గట్టిగానే ఉంటుందని భావిస్తున్నారు. నవీన్ కామెడీ ..మీనాక్షి గ్లామర్ .. రావు రమేశ్ విలక్షణ నటన ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణగా నిలుస్తాయని అంటున్నారు. ఇంతవరకూ ఈ సినిమాలో కామెడీనే ప్రధానమైన అంశంగా భావిస్తూ వచ్చారు. అయితే తాజాగా జరిగిన ఒక ఈవెంటులో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, ఈ సినిమాలో పొలిటికల్ టచ్ కూడా ఉంటుందని చెప్పారు. పొలిటికల్ ఎపిసోడ్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుందనీ, వీలైనంత వినోదాన్ని అందిస్తుందని అన్నారు. మొత్తానికి సంక్రాంతికి అవసరమైన అన్ని రకాల వినోదపరమైన అంశాలను కలుపుకుని వస్తున్న ఈ సినిమా, ఏ స్థాయిలో అలరిస్తుందనేది చూడాలి.

## 'అనగనగా ఒక రాజు'లో పొలిటికల్ టచ్ కూడా!









# 30ఏళ్ల కల.. సాకారం కానున్న వేళ

- సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించనున్న సీఎం
- శరవేగంగా ప్రాజెక్టు పనులు పూర్తి..
- వైఎస్ఆర్ హయాంలోనే సదర్మాట్‌కు పునాది..
- 30ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు బ్యారేజీ నిర్మాణంతో తెర
- సదర్మాట్ బ్యారేజీ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- సీఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్షించిన కలెక్టర్, అధికారులు

## ప్రారంభోత్సవానికి ముస్తాబైన సదర్‌మాట్ బ్యారేజీ



**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న మామడ మండలం పొన్కల్ గ్రామంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నందున, ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సదర్మాట్ బ్యారేజి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజి ప్రాంగణం పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. హెలిప్యాడ్ ను పరిశీలించారు. హెలిప్యాడ్ నుండి బ్యారేజి వరకు సరైన రోడ్డు సౌకర్యం ఉండాలన్నారు. అధికారులు, విఐపి లకు అనువైన పార్కింగ్ ను ఏర్పాటు చేయాలని చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్లు, టెంట్, షామియానా, సరిపడినన్ని కుర్చీలు, తదితర వసతులు కల్పించాలని సూచించారు. అత్యవసర వైద్య బృందం సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ, వారికి కేటాయించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సదర్మాట్ బ్యారేజి పరిసర ప్రాంతాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు సిబ్బందికి, భద్రత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, నీటిపారుదల శాఖ అధికారి అనిల్, డిపిఓ శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.ఎ రజాక్, అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, పోలీసు శాఖల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**రెండు జిల్లాలకు ప్రయోజనం...**
నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్నకల్ గ్రామ శివారులో గోదావరి నదిపై నిర్మల్ జగిత్యాల సరిహద్దులు నిర్మించారు. ఈ ప్రాజెక్టు శ్రీరాంసాగర్ దిగువన 40 కిలోమీటర్ల దూరంలో 1.58 టీఎంసీ కెపాసిటీలో ఒక కిలోమీటర్ పొడుగులో 55 వరద గేట్లతో ఈ ప్రాజెక్టు 2025 లో పూర్తి చేశారు. గోదావరి నది రెండు నది ఒడ్డులను కలుపుకొని నిర్మించిన ఈ ప్రాజెక్టు వల్ల నిర్మల్ జగిత్యాల జిల్లా లోని ఖానాపూర్ కడెం ఇబ్రహీంపట్నం మల్లాపూర్ మండలంలోని 18వేల ఎకరాలకు సాగు నీరు అందించనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో నిర్మల్ జిల్లాలోని ఆదర్శనగర్ కొమ్మల్కోట్ పోనకల్ గ్రామాల పరిధిలో 1230 ఎకరాలు రైతుల భూములు ముంపు గురయ్యాయి. ప్రభుత్వం నష్టపరిహారం కింద ఎక రానికి 14.30 లక్షల నష్టపరిహారాన్ని అందించింది. ఈ పరిహారాన్ని అప్పటి ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేసింది. ప్రస్తుతం సదర్ మార్ట్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో కంప్లీట్ కావడంతో 10 కిలోమీటర్ల పొడుగులో గోదావరి నదిలో నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు గేట్లు ఎత్తితే దిగువలో ఉన్న నిజాం కాలంలో నిర్మించిన సదర్‌మార్ట్ ఆనకట్టకు నీరు చేరి అవకా శం ఉంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన నీరు మొత్తం ఈ ప్రాజెక్టులోకి నేరుగా చేరుతుంది. ప్రాజెక్టు నిర్మించాలని 30 ఏండ్లుగా ఖానాపూర్ కడెం ఇబ్రహీంపట్నం మల్లాపూర్ తదితర గ్రామాల ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి అనేకసార్లు ఉద్యమా లు కూడా చేపట్టారు. దీంతో ప్రాజెక్టు నిర్మా ణం పనులు పూర్తికావడంతో రైతులకు సాగునీటి కళ నెరవేరబోతుంది. మరో 14 కోట్లతో విద్యుత్ సబ్స్టేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్మల్ జగిత్యాల నిజామాబాద్ జిల్లాలోని సుమారు 30 గ్రామాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం కూడా ఉంది.

**సీఎం దృష్టికి రైతుల డిమాండ్లు..**
గోదావరి నదిపై సదర్ మట్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ఖానాపూర్ కడెం మండల రైతులు 30 సంవత్సరాల నుంచి డిమాండ్ చేస్తున్నా రు. గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం కొరకు నిధులు మం జూరు చేయడంతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ఈనెల 16న ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభించబోతున్నాం. నిర్మల్ జగిత్యా ల జిల్లాలోని 18 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. రైతులు డిమాండ్ చేస్తున్న కాలువ నిర్మాణం ఎత్తిపోతల పథకం విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా రైతులకు న్యాయం జరిగేలా చూస్తా.

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**
















# పదపదవే వయ్యారి గాలిపటమా..!





- పతంగులను ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతున్న యువత
- సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ
- కుటుంబ సమేతంగా గాలిపటాల ఎగురవేత
- మార్కెట్‌లో అందుబాటులోకి వివిధ రకాల గాలిపటాలు
- అందమైన ఆకృతులు,
- ఆకర్షణీయమైన రంగులు
- పెరిగిన పతంగులు, ధారం ధరలు
- చైనా మాంజా నిషేధం

**పిల్లలు, యువకులు సరదాగా ఎగరేసుకునే గాలిపటం.. ఓ పండుగ వేళ జరిగే సంబురాల్లో చోటుదక్కించుకోవడం గమనార్హం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జరిగే సంక్రాంతి రోజుల్లో పతంగులను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఆదొక కళారూపాన్ని సంతరించకుంది. కొన్ని గాలిపటాలు పోటీల కోసం వివిధ డిజైన్లలో ఆకర్షణీయంగా తయారు చేస్తారు. అధిక శక్తిమంతమైన గాలిపటాలుగా కూడా కొన్నింటిని తయారుచేస్తారు. ఇటువంటి వాటిని సర్ఫింగ్, బోర్డింగ్ /బుగ్గీయింగ్ వంటి క్రీడల్లో ఉపయోగిస్తున్నారు. కొన్ని చోట్ల పోటీలు కూడా జరుగుతుంటాయి.. అటువంటి గాలిపటం విశేషాలు.**



గాలిపటం/ పతంగిని ఇంగ్లీషులో కైట్ అంటారు. అయితే కైట్‌కు... గాలిపటం సహా మొనగాడు, అవినీతి చర్య, మోసపు చర్య అనే అర్థాలు కూడా ఉన్నాయి.

గాలిపటాన్ని ఎక్కువగా సరదాకోసమే ఎగురవేస్తారు. గాలిపటం ఎగరడానికి ముఖ్యంగా దారంలోని బలం(టెన్షన్) ప్రధాన కారణం. పటం ఎగరడానికి అవసరమైన లిఫ్ట్ గాలి ద్వారానే లభిస్తుంది. గాలిపటం డిజైన్ కారణంగా గాలిపటం పైభాగంలో తక్కువ ఒత్తిడి..కింది భాగంలో ఎక్కువ ఒత్తిడి కలిగి ఎగరగలుగుతుంది. ఇదే మూల సూత్రం గాలి వీచే దిక్కుగా ముందుకు పోవడానికి తోడ్పడుతుంది. ఈ రెండు బలాలకు దారం లేదా దారాల్లోని బలం వ్యతిరేక దిశలో పనిచేసి గాలిపటాన్ని నియంత్రిస్తుంది. ఇదే సూత్రం పంతంగిని నిలకడగా ఎగురవేసేందుకూ దోహదపడుతుంది. గాలిపటాన్ని పరుగెడుతూ... పడవలేదా...
కదిలే వాహనాలపై నుండి కూడా ఎగురవేయవచ్చు. గాలిపటాలు సామాన్యంగా గాలికంటేబరువైనవి. అయితేకొన్ని రకాలు గాలికంటే తేలికైనవి కూడా తయారు చేస్తారు. వీటిని హెలికైట్స్ అంటారు. ఇవి వేచేగాలి లేకుండా కూడా ఎగురుతాయి. దీనిలో హీలియం బెలూన్ ఉపయోగిస్తారు.

### తయారుచేసే విధానం...

గాలిలో ఎగరడానికి అనువైన కాగితం అవసరం. పట్టు, సిల్కు వస్త్రముతో కూడా చేయవచ్చు. కొటి లేదా రెండు వెదురు లేదా కొబ్బరి ఈనెల వంటి పెల్లలను తెరచాప ఆధారాల లాగా అమర్చి కాగితాన్ని అతికించి పుల్ల మధ్యలో దారం(సూత్రం) కడితే గాలి పటం తయారు అవుతుంది. గాలిలో నియంత్రణ కలిగి ఉండడానికి తోకను కూడా అమరుస్తుంటారు.
సాంప్రదాయకంగా గాలిపటాల్లో కొబ్బరి ఈనె, వెదురు బద్ద లేదా మరేదైనా తేలికగా ఉండి.. వంగే గుణం ఉండే పుల్లలను ఆధారాలుగా...కాగితాన్ని ఎగిరేందుకు తోడ్పడే తెరలాగా వాడతారు. అయితే నవీన పద్దతుల్లో గాలి పటాలని ఉలిపిరి పొరలవంటి (ఫాయిల్)తెరలను ఉపయోగించి ఏవిధమైన ఆధారాలు లేకుండానే తయారు చేస్తున్నారు. కొన్ని సార్లు తెరలకి ఆకర్షణీయమైన ఫైబర్-గ్లాస్ (కృత్రిమమైన నారతో తయారుచేసే గాజు) కార్బన్-నార లాంటి వాటిని తెరలుగా, డెర్కాన్ లేదా డైనిమా లాంటి కృత్రిమ పదార్థాలను కూడా ఆధారాలుగా వాడుతున్నారు. గాలిపటాలను మా మూలు దారం లేదా ట్వయిన్ దారంతో ఎగరవేస్తారు. కొన్ని సార్లు వేరే గాలిపటాల దారాలను తెంచడం కోం గాజు పిండిని దారానికి పూస్తుం టారు. గాలిపాలని అనేక ఆకారాల్లో తయారు చేయవచ్చు. ఇప్పుడు ఆధునిక పద్దతుల్లో ఎటువంటి ఆధారాలూ లేకుండానే తయారు చేస్తున్నా రు. అయితే మామూలుగా పిల్లలు ఆడుకునే గాలిపటాలు చతురస్రం, డైమండ్ ఆకారాల్లోనే ఎక్కువగా ఉంటాయి. చిన్న పిల్లలు తమకు తాముగా తయారుచేసుకోవాలనే కుతూహలంతో ఇళ్లలో ఉండే పేపర్లు, వార్తా పత్రికలను ఉపయోగించి తయారు చేయడం చూస్తూనే ఉంటాం.

**గుజరాత్‌లో అంతర్జాతీయ గాలిపటాల పండుగ నిర్వహిస్తారు.**

### చిన్న చిన్న ప్రమాదాలు...

గాలిపటాల ద్వారా చిన్న చిన్న ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. ఎక్కువగా గాజుపొడితో తయారుచేసే మాంజా (దారం) ఆధారంగా జరుగుతుంటాయి. దీంతో ఎగురవేస్తున్న వ్యక్తి వేళ్లు కోసుకుపోయే ప్రమాదం ఉంది. దీన్ని నివారించాలంటే.. ఎగురవేస్తున్న సమయంలో రెండు చేతులకు రక్షణ తొడుగు(గ్లౌజ్)ను ఉపయోగించాలి. రహదారి పక్కన తెగిపడిన గాలిపటం దారం కారణంగా ప్రమాదాలు జరుగుతాయి. మేడ పై భాగం నుంచి గాలిపటాలు ఎగురవేస్తున్న సందర్భాల్లో తగిన జాగ్రతత్తలు తీసుకోవాలి. లేకుంటే కిందపడే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గాలిపటం ఎగరేస్తున్నప్పుడు తగిగానున్న దారం విద్యుత్ తీగలకు ఆనుకుంటే ఎగరేస్తున్న వ్యక్తి విద్యుద్ఘాతానికి గురయ్యే అవకాశం ఉంది.

### చెన్నైలో ఎగరేస్తే.. జైలుకే

చెన్నైలో గాలిపటాలు ఎగరేస్తే జైల్లో పెడతారు. అక్కడి పోలీసులు ప్రవేశపెట్టిన కొత్త నిబంధన ప్రకారం అక్కడ గాలిపటాలు ఎగరేయడం నేరం. గాలిపటాలను ఎగరేయడానికి ఉపయోగించే దారాని (మంజా)కి గాజు పెంకులతో తయారు చేసిన పొడి పూస్తారు. దీంతో దారం చాలా పదునుగా మారుతుంది. మాంజాతో గాలిపటాలు ఎగరేస్తే.. వేయి రూపాయలు జరిమానా.. లేదా మూడు నెలల జైలు శిక్ష విధిస్తారు. కొన్నేళ్ల క్రితం చెన్నైలో మాంజా కారణంగా గాయపడిన ఓ బాలుడు చనిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.









# పట్నం నుంచి పల్లెబాట



- పండగ నేపథ్యంలో సొంతూళ్లకు బారులు తీరిన జనం
- బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిట
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

**ఆదిలాబాద్ ప్రతినిధి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు పల్లెబాట పట్టారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లా పాపలతో కలిసి సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. దీంతో ఉదయం నుంచే రహదారులు రద్దీగా మారాయి. జాతీయ రహదారి పొడవునా జంక్షన్‌లన్నీ జామ్ అయ్యాయి. రైళ్లు నిండిపోయాయి. ఉమ్మడి జిల్లా లోని రైల్వే స్టేషన్‌ల నుంచి వందల సంఖ్యలో ప్రయా ణికులు బస్టాండ్‌కు చేరడంతో బస్టాండ్ కిక్కిరిసిపోయింది. అసలే ఉచిత ప్రయాణం వల్ల మహిళలతో రద్దీగా ఉండే బస్సులు ఇప్పుడు పట్నం జనం, ఉమ్మడి జిల్లాలోని ఆదిలా బాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ఊళ్ళకు వెళ్ళే జనాలతో నిండిపోతున్నాయి. మహా రాష్ట్రకు సరిహద్దులో ఉండడంతో పాటు ఉమ్మడి జిల్లాలో విస్తరించిన హైవేపై వాహనాలు బారులు తీరాయి. దారి పొడవునా ఎక్కడ చిన్న జంక్షన్ ఉన్నా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఒక్కో జంక్షన్ దాటేందుకు కనీసం అరగంట సమయం పట్టడంతో హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వచ్చేందుకు మూడుగంటలపైనే అవుతోంది. పోలీసులు, ఎస్ఐలు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు శ్రమించాల్సి వస్తోంది. ఆదివారం రద్దీ మరింత పెరగనుంది.

**కళకళలాడుతున్న పల్లె లోగిళ్లు...**

ఉపాధి కోసం వలస వెళ్లిన వారు, ఉద్యోగం, చదువుల నిమిత్తం హైదరాబాద్, ఆదిలాబాద్, వంటి పట్టణాల్లో ఉన్న వారు పండగకు సొంతూళ్ళకు వస్తుండటంతో ఇన్నాళ్లు బోసిబోయిన పల్లెలు సంద డిగా మారుతున్నాయి. తాళాలు వేసిన ఇళ్లు తెరుచుకుంటున్నాయి.

**ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు...**

పండుగకు ప్రజలు అధిక సంఖ్యలో గ్రామాలకు వెళ్తుండటంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ పెరిగిందని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ చెప్పారు. పండగకు రెండుత రోజులు ఉండడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున జాతీయ రహదారిపై ఉన్న ఆయా స్టేషన్‌ల పరిధిలోని పోలీసులు ట్రాఫిక్ కట్టడి కి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదా రిపై వాహనాల రద్దీని పరిశీలించి, పోలీసులకు తగిన సూ చనలు చేశారు. నేడు, రేపు పోలీసులు అలర్ట్‌గా ఉండాల న్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకో వాలన్నారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.



### రోడ్డు ప్రమాదాల నివారణకు
## అరైవ్ అలైవ్ కార్యక్రమం

**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు రత్నాపూర్ కాండ్లి గ్రామంలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని హెచ్చరించారు. అదే విధంగా వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

### గిన్నిస్‌బుక్ రికార్డు విద్యార్థులను
## అభినందించిన కలెక్టర్



**బెల్లంపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లికి చెందిన వేముల మానస, శ్రీనివాస్ దంపతుల కుమార్తెలు వెన్నెల, శ్రీ నిత్యలు కూచిపూడిలో ప్రావీణ్యం సాధించి గిన్నిస్ బుక్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఇద్దరు బాలికలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిరోజు సాధన చేస్తే ఏ రంగంలోనైనా అత్యుత్తమ ప్రావీణ్యం పొందవచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

## పరిసరాల శుభ్రత పాటించాలి

**జైనూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలం జంగాం గ్రామపంచాయతీ పరిదిలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని గ్రామ సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్ తెలిపారు. సోమవారం గ్రామంలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్‌తో కలిసి సందర్శించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు ఆత్రం అంబిబాయి, భగవత్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



## దండేపల్లి మండలంలో ఏఈవో సస్పెన్షన్

**దండేపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఓ ఏఈవోను సస్పెండ్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పరిధిలోని పలు వ్యవసాయ కళాశాలల్లో ఇన్ సర్వీస్ కోటా కింద బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న 30 మంది ఏఈవోలు మూడో సంవత్సరం బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల్లో లీకైనా ప్రశ్నపత్రాలతో పరీక్షలు రాసినట్లు అధికారులు విచారణలో తేలింది. ఇందుకు గాను వారందరినీ వ్యవసాయశాఖ సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. వీరిలో మండలానికి చెందిన ఓ ఏఈవో ఉన్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి సురేఖను సంప్రదించగా, సస్పెండైన విషయం వాస్తవమేనని తెలిపారు.

### విద్యుత్ వినియోగదారులకు
## శుభాకాంక్షల లేఖలు

**మంచిర్యాల, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్ష సంబంధాలను బలోపేతం చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్స్) ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. గృహ జ్యోతి లబ్ధిదారులకు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారు లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షల సందేశ లేఖలను జిల్లాలో అందజేస్తున్నారు. వ్యక్తిగతంగా కలుస్తూ వినియోగదారుడి పేరు, సర్వీస్ కనెక్షన్ నెంబర్‌తో వ్యక్తిగతంగా అడ్రస్ చేసిన ఈ లేఖలను టిజిఎన్పీడీసీఎల్ అధికారులు స్వయంగా వినియోగదారులకు పంపిణీ చేస్తున్నారు.





## దుబాయ్‌లో సంక్రాంతి వేడుకలు

**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి స్థిరపడిన తెలుగువారంతా కలిసి మంగళవారం యూఏఈలోని దుబాయ్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దుబాయ్‌లోని లల్వీక్ ప్రాంతంలో పద్మశాలి సామాజికవర్గ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. నిర్మల్, ఖానాపూర్, కడెం, జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు 80 కుటుంబాలు ఇందులో పాలుపంచుకున్నాయి. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## రాజురాను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**నేరడిగొండ, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

మండలంలోని తన స్వగ్రామం రాజురాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హామీ ఇచ్చారు. రాజురాలో మంగళవారం పర్యటించారు. వాంకిడి నుంచి రాజురా వరకు డబుల్ రోడ్డు, గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు.



## దుప్పిని వేటాడిన ఆరుగురి అరెస్ట్

**భీమారం, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

చుక్కల దుప్పిని వేటాడిన కేసులో మంగళవారం ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల ఎఫ్ఆర్‌వో రత్నాకర్ రావు తెలిపారు. మంచిర్యాల అటవీరేంజ్ పరిధిలోని పోతనపల్లి రిజర్వు ఫారెస్ట్‌లోని 66వ కంపార్ట్మెంట్‌లో ఈనెల 9న భీమారం గ్రామానికి చెందిన ఆజ్మీర పున్నం, రమేశ్ విద్యుత్ తీగలకు కొంకీలువేసి చుక్కల దుప్పిని హతమార్చినట్లు తెలిపారు. విచారణలో వీరిద్దరితో పాటు బాసాని కిష్టస్వామి, దారవేణి కిరణ్, సెగ్యం గోపాల్, పెన్కుల గోపాల్ ఉన్నట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఆరుగురిని అరెస్టు చేసి చెన్నూరు కోర్టులో హాజరుపర్చగా పున్నం, రమేశ్‌కు 11రోజుల పాటు రిమాండ్ విధించింది. మిగితా నలుగురిని ఆదిలాబాద్ జిల్లా జైలుకు రిమాండ్‌కు తరలించగా సొంత పూచికత్తుపై న్యాయమూర్తి కండీషన్ బెయిల్ మంజూరు చేసినట్లు తెలిపారు.

## సదల్‌పూర్ జంగి జాతర

**బేల, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

బేల మండలంలోని సదల్‌పూర్ అతిపురాతనమైన భైరాం దేవ్ మహాదేవ్ ఆలయంలో ఏటా పుష్యమాసంలో నిర్వహించే జంగి జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. కొరంగే వంశస్తులు, సర్పంచ్ దంపతులు ఆదివాసీల సంప్రదాయం ప్రకారం డప్పుచప్పుళ్లు, భజనల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఈ నెల 19 వరకు కొనసాగనుంది. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు కొరంగే సోనేరావ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆశన్న రచించిన సదలేశ్వర శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్యామ్ రావ్, సర్పంచ్ మంగేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బల్దియా పోలింగ్ కేంద్రాలు 216

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబి తాను మున్సిపల్ అధికారులు మంగళవారం రాత్రి విడుదల చేశారు. 750 మంది ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. పట్టణంలోని 49 వార్డుల పరిధిలో 216 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఓటర్ల సంఖ్య పెరిగిన నేపథ్యంలో 33పోలింగ్ కేంద్రాలు కూడా అదనంగా పెరిగాయి. వీటిపై ఈ నెల 15వ రకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటికి అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు. 16న ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించనున్నారు. ఆ తర్వాత మున్సిపల్ వార్డు స్థానాల రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశమున్నట్లు ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజా విక్రయించిన ఇద్దరు అరెస్టు

**బెల్లంపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో చైనా మాంజా అమ్మిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బెల్లంపల్లి వన్ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కే. శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. బెల్లంపల్లి పట్టణంలో పలు దుకాణాలో చైనా మంజా విక్రయిస్తున్నట్టు సమాచారం మేరకు సోదా చేశారు. ఈ సోదాలో పోస్టాఫీస్ బస్తీలో వెంగళ విజయ వద్ద 5 చైనా మాంజా చుట్టలు, వెంగళ రాజమల్లు వద్ద 3 చైనా మాంజా చుట్టలు, 60 చైనా మాంజా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకునీ దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరుగంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు

**చెన్నూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ ఘటనలో పోలీసులు అరుగంటల్లో దొంగను పట్టుకున్నట్లు సీఐ దేవేందర్ రావు తెలిపారు. సోమవారం రాత్రి పూజా కార్యక్రమాలు ముగించుకుని అర్చకులు స్టోర్ రూమ్, ప్రధాన గేట్‌కు తాళలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చేసరికి గేట్‌తో పాటు స్టోర్ గది తలుపులు పగిలి ఉండడాన్ని గమనించిన ఆర్చకుడు వేమారం సత్యమూర్తి ఆలయ కమిటీ అధ్యక్షుడు రామయ్యకు సమాచారం అందించాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ టీవీ పుటేజీ ఆధారంగా సమ్మయ్య అనే వ్యక్తిని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. చోరీకి గురైన ఆలయ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పశువులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు

**చింతలమానేపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
పశువులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఖర్జెల్లీ ఎస్ఆర్డీఓ సుభాష్ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున డిప్యూటీ రేంజర్ హైమావతి, ఎఫ్‌బీవో ప్రభాకర్ అటవీ ప్రాంతంలో గస్తీలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కోర్సిని బీట్‌లోని 174 కంపార్ట్మెంట్‌లో శబ్దం వినిపించింది. అక్కడికి వెళ్లి చూడగా ముగ్గురు వ్యక్తులు, ఒక వాహనం అందులో 18 పశువులు కనిపించాయి. పశువులను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఖర్జెల్లి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన జల్లంపల్లి నారాయణ, నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన మహ్మద్ అమీనుల్లాఖాన్, మహ్మద్ మొబిన్ ఖురేషిపై అటవీ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సారంగాపూర్, సౌన్, మామడ, లక్ష్మణచందా, దిలవార్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన 103 మంది లబ్ధిదారులకు రూ.32 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీని యర్ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా, పట్టణ బీజేపీ నాయకులు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షు లు, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏటేటా తగ్గిపోతున్న వట్టివాగు ఆయకట్టు

**ఆసిఫాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
వట్టివాగు ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. యేటేటా ఓపెన్‌కాస్టు మట్టితో ప్రాజెక్టును నింపుతుండగా, మున్ముందు ఆయకట్టు సాగు కష్టమేనన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇక ప్రస్తుతం కాలువలకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సాగు నీరందించలేమని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని యంత్రంగాం సూచిస్తున్నది.





**నీరున్నా ఉపయోగం సున్నా...**
జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్టు తర్వాత చెప్పుకోదగ్గది వట్టివాగు ప్రాజెక్టు. దాదాపు 27 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో దీనిని నిర్మించారు. 2.06 టీఎంసీల నీటి సామర్థ్యంతో దీనిని నిర్మించారు. 2001లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసినప్పటి నుంచి ఏ యేడాది కూడా పూర్తిస్థాయిలో సాగు నీరందించలేకపోయింది. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ వాటిని పంటలకు వినియోగించలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.00 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నపటికీ కనీసం యాసంగి పంటలకు కూడా నీరు అందించలేని పరిస్థితి ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కలిసి ప్రాజెక్టులోని నీరు రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. కాలువలకు మరమ్మతులు చేయకపోవడం.. పూడికతో నిండిపోవడం.. ఎక్కడికక్కడ ధ్వంసం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 27 వేల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టు ప్రస్తుతం 1500 ఎకరాలకు మాత్రమే సాగు నీరందిస్తున్నది. ఈ ఏడాది కాలువల మరమ్మతులకు నిధులు మంజూయ్యాయని చెబుతున్న అధికారులు, వేసవిలో కాలువల మరమ్మతులు చేయనున్న కారణంగా నీరివ్వడం సాధ్యం కాదని, రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రాజెక్టు కింద సాగవుతున్న ఆ మాత్రం సాగు ప్రశ్నార్థకంగా మారింది.

**సాగు నీటికి బ్రేక్..**
వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టుపై రైతులు ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. కాలువల మరమ్మతుల కారణంగా యాసంగిలో వరిసాగుకు పూర్తిస్థాయిలో నీరు అందించలేమని అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టు కింద ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని సూచిస్తున్నారు. 27 వేల ఎకరాలకు సాగునీరందించాల్సిన ఈ ప్రాజెక్టు ఆయకట్టును అనేక ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం సుమారు 2 వేల లోపు ఎకరాలకు సాగునీరందుతోంది. ఓపెన్ కాస్టు పూడికమట్టితో ఓ వైపు నీటి సామర్థ్యం తగ్గిపోయింది. మరోవైపు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో పంటలకు సాగునీరందించే పరిస్థితి లేకుండా పోతున్నది. ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లోని పంటలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు.. కేవలం రెబ్బెన మండలంలోని కొద్ది పాటి పంటలు మాత్రమే నీరందిస్తున్నది. ఈ ఏడాది కాలువల మరమ్మతులకు రూ. 60 లక్షలు మంజూరయ్యాయని, ఆ కారణంగా పంటలకు నీరు ఇవ్వలేమని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారని రైతులు చెబుతున్నారు.



# మెరుగైన వైద్యం అందాలి

### డీఎంహెచ్‌ఓ నరేందర్ - గిమ్మ పీహెచ్‌సీ సందర్శన

**సాత్నాల, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. భోరజ్ మండలం గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డులు, ఫార్మసీ, వ్యాక్సిన్ రూమ్, ల్యాబ్, లేబర్ రూమ్, ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి ప్రసవం వరకు వైద్యపరీక్షలు నిర్వహించి సేవలందించాలని, అధిక ప్రమాద గర్భిణులను ముందే గుర్తించి పెద్దస్పత్రికి పంపించాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో గ్రామస్థాయిలో గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రసవాలు ప్రభుత్వాస్పత్రిలోనే జరిగేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సుచల, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాంరెడ్డి, స్టాఫ్ నర్స్ సంస్కృతి, ఏఎన్ఎం నీరజ, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.



## పేదలకు కంటి శస్త్రచికిత్స

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని ద్రా గ్రామానికి చెందిన పలువురికి మంగళవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గ్రామంలో ఈనెల 3న వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి 11 మంది శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వారిని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి తీసుకువచ్చి ఆరుగురికి శస్త్ర చికిత్స చేయగా మరో ఐదుగురికి మాత్రలు అందించినట్లు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స చేయించిన ఎస్పీకి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. వైద్యులు ప్రియాంక, మాధురి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రంజిత్, పోలీసు అసోసియే షన్‌అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గూడెం ఎత్తిపోతల ట్రయల్‌రన్ సక్సెస్

**దండేపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ మంగళవారం విజయవంతమైంది. దీంతో ఈ నెల 15న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు చేతుల మీదుగా తానిమడుగు డెలివరీ పాయింట్ వద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నట్లు కడెం ఈఈ ప్రవీణ్ తెలిపారు. ఇన్ని రోజులు కంట్రోల్ ప్యానల్‌ను కొత్త గదిలోకి మార్చే పనులు చేపట్టడంతో నీటి విడుదలకు కొంత ఆలస్యమైనట్లు పేర్కొన్నారు. కాగా, కంట్రోల్ ప్యానల్ కొత్తగదిలో బిగించే పనులు సోమవారం పూర్తయ్యాయి.



# పాఠశాల కిచెన్ షెడ్‌కు భూమి పూజ

**జైనూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణానికి మార్లవాయి గ్రామపంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ గారు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్న విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో టీ.ఏ. లింగేశ్వర్, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రాజేశ్వర్, సభ్యులు సోయం రాజు, కనక భరత్, పటేల్ ఆత్రం భగవంత్ రావు, గ్రామస్థులు సింగు యాదవ్, మోతిరామ్, జూగాది రావు, లచ్చు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# నీటి వనరుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు

**ఆసిఫాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** జిల్లాలో నీటి వనరులను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్యలతో కలిసి అటవీ, నీటి పారుదల, రెవెన్యూ, మత్స్య, పర్యాటక శాఖల అధికారులతో నీటి వనరుల రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 150 చెరువులను చిత్తడి నేల (వెట్ ల్యాండ్)గా గుర్తించామని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఆయా చెరువులను సందర్శించి అవసరమైన వేదికలను రూపొందించి అందించాలని తెలిపారు. చెరువులు ధ్వంసం కాకుండా రక్షించడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని చెప్పారు. చెరువులలో నీరు నిలువ ఉంటే పవువులు, జంతువులు, పశువులకు దాహార్తి తీరుతుందన్నారు. మత్స్యకారులు చేపలు పెంచడం ద్వారా జీవనోపాధి పొందుతారని అన్నారు. రైతులు చెరువు ఆయకట్టు కింద పంట సాగు చేసుకుంటారని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీరు నిలువ ఉండే శిఖం ప్రాంతాన్ని గుర్తించాలని సూచించారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో సురక్షితంగా, పర్యావరణ హితంగా పతంగులను ఎగురవేసే గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు ప్రభాకర్, గుణవంతరావు, అశ్వక్ అహ్మద్, అటవీ, ఇతర శాఖల అదికారులు పాల్గొన్నారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే






### జాతీయ బాక్సింగ్‌లో

## సత్తా చాటిన వంగరి నితిక్ష

**కాగజ్‌నగర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్‌లోని డీఏవీ లక్ష్మీపత్ సింగానియా పబ్లిక్ స్కూల్ ఏడవ తరగతి విద్యార్థిని వంగరి నితిక్ష ఢిల్లీలో జరిగిన డీఏవీ జాతీయ క్రీడా పోటీలు--2025లో అండర్-14, 48-50 కిలోల విభాగంలో వెండి పతకం సాధించింది. చిన్న వయసులోనే క్రమశిక్షణ, పట్టుదలతో రాష్ట్ర స్థాయిని దాటి జాతీయ వేదికపై మెరిసిన నితిక్షకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడ్పడిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## తల్లి, కొడుకు అదృశ్యం




**బెజ్జూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** తల్లి, కొడుకు అదృశ్యమైన సంఘటన బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లా, అహరి గ్రామానికి చెందిన దూడ మల్లేష్ పెద్ద కూతురు బెజ్జూర్ మండలం సలుగుపల్లిలో నివసిస్తోంది. సలగుపల్లి గ్రామానికి చెందిన బండి సుజాత(45), తన కుమారుడు బండి శ్రావణ్ కుమార్ (12) జనవరి 2న అహరి గ్రామం నుంచి సలగుపల్లి వెళ్లేందుకు బయలు దేరింది. అప్పటి నుంచి ఆమె సలగుపల్లికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో తండ్రి దూడ మల్లేష్ బెజ్జూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. వారి ఆచూకి తెలిస్తే.. వెంటనే సీఐ సంతోష్ కుమార్ 8712670512, ఎస్సై పాషా 8712670541కి సమాచారం అందించాలని కోరారు.

## ఆర్థిక సాయం అందజేత

**ముథోల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించి (చెక్కు) అందించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ మంగళశారం మహాగాం గ్రామంలో ఇటీవల హఠాత్ మరణం పొందిన మహాగాంకు చెంది శంకర్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి తన వంతుగా ఆర్థిక సాయం అందించాలన్న ఉద్దేశంతో చెక్కు రూపంలో ప్రజా ట్రస్ట్ తరఫున నగదు అందించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన భోజన్న ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురి కావడంతో అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. చింతల్‌బోరి గ్రామానికి చెందిన జాదవ్ పవన్ గుండెపోటుతో ఇటీవల మరణించడంతో వాళ్ల కుటుంబీకులకు పరామర్శించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మహాగాం గ్రామ సర్పంచ్ రాకేష్ బిజెపి యువ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి



**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం ద్వార పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని 33 మంది లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణి చేశారు. పేదలకు ఆరోగ్య శ్రీ ద్వార అయిదు లక్షల నుండి పది లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. వైద్యానికి చేస్తున్న అప్పులు ఎలా తీర్చాలో తెలియక బాధితులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేటులో వైద్యం చేసుకున్న వారికి కనీసం యాభై శాతం సీఎంఆర్ఎఫ్ ద్వార అందిస్తే ఊరట కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల ప్రవీణ్, దయాకర్, లాలా మున్న పాల్గొన్నారు.

## తెప్పపై వెళ్లి.. మరమ్మతులు చేసి



**కడెం, జనవరి 13 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రంలోని పెద్దూర్ వ్యవసాయ విద్యుత్ సరఫరాకు మంగళవారం ఆంతరాయం ఏర్పడింది. కడెం ప్రాజెక్ట్ నీటిలో ఉన్న విద్యుత్ స్తంభంపై సమస్య రావడంతో అసిస్టెంట్ లైన్మెన్ శ్రీనివాస్ సహాయంతో ఆన్ మ్యాన్ కార్మికుడు గంగన్న తెప్పపై వెళ్లి నీటిలో ఉన్న స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేశాడు. సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరా పున రుద్ధరించిన సిబ్బందిని ఏఈఈ రాసింగ్, రైతులు అభినందించారు.

## మైనార్టీ గర్ల్స్ స్కూల్‌పై తప్పుడు ప్రచారం




**బెల్లంపల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారం తగదని ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.మాధవి, పీ.స్రవంతి, మైమున్నా తస్లిమ్, ఎండి మహమ్మద్, ఎండి గౌస్, హామీమ్, పీక లక్ష్మణ్ లు మాట్లాడారు. ఈనెల 1వ తేదీన తల్లిదండ్రుల అనుమతితోనే విద్యార్థులను పాఠశాల పక్కనే ఉన్న ఎగ్జిబిషన్‌కు పాఠశాల సిబ్బంది తీసుకుపోయారని పేర్కొన్నారు. పిల్లలను ఎగ్జిబిషన్ తీసుకువెళ్లేందుకు ఒక్కొక్క విద్యార్థికి తామే రూ.150 కూడా ఇచ్చామని తెలిపారు. ఎగ్జిబిషన్‌కు వెళ్లిన సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని, ఫుడ్ పాయిజన్ అయినట్లు కొందరు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు. బెల్లంపల్లి పట్టణంలో ఎంతో సౌకర్యవంతంగా ఉన్న భవనంలో కొనసాగుతున్న పాఠశాలలో మంచి విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకుపాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేవని కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు.



### వసంత పంచమి ఉత్సవాలకు

## ముథోల్ ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ముథోల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో రానున్న వసంత పంచమి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, అర్చకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాసర ఆలయం రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని, వసంత పంచమి వంటి పవిత్ర పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందకరమని తెలిపారు. వసంత పంచమి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు మౌలిక సదుపాయాలు అందించాలని, క్యూ లైన్‌లో నిలబడిన స్త్రీలకు అక్కడక్కడ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఏటువంటి అవాంఛనీయమైన ఘటనలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను సూచించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా

## డా.లక్ష్మణ్ కేంద్రే ఎన్నిక

**ఆదిలాబాద్, జనవరి 13 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన డా. లక్ష్మణ్ కేంద్రే బీజేపీ జిల్లా కమిటీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పార్టీ నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఆయనకు ఈ బాధ్యత లభించింది. పార్టీ బలోపేతం కోసం చేసిన సేవలకు గుర్తింపుగా పదవి దక్కిందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు, కార్యకర్తలు డా. లక్ష్మణ్ కేం ద్రేకు శుభాకాంక్షలు తెలిపారు.








# నాగోబా జాతరకు సర్వం సిద్ధం

- గిరిజన కుంభమేళాకు కేస్లాపూర్ ముస్తాబు
- ఈనెల 18న మహాపూజతో ప్రారంభం
- భక్తులకు ఇబ్బంది కలగకుండా పటిష్ట ఏర్పాట్లు
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- 350 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- నిరంతర నిఘా కోసం సీసీత కెమెరాలు..
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

**ఇంద్రవెల్లి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఈ నెల 18 నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్న నాగోబా జాతరను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కేస్లాపూర్ దర్బార్ హాల్‌లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, ఖానా పూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జులతో కలిసి జాతర ఏర్పా ట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా జాతరను సాంప్రదాయబద్ధంగా, పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ రాత్రి మహాపూజతో జాతర ప్రారంభమవుతుందని, 22వ తేదీన దర్బార్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు శాఖల వారీగా చేపట్టిన పనులు సుమారు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జాతర ప్రాంగణంలో ప్రభుత్వ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేయాలని, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ నిరంతరం చేపట్టాలని సూచించారు. వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, 104, 108 అంబులెన్సులు, మొబైల్ బైక్‌లు అందుబాటులో ఉంచి భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సరఫరా సక్రమంగా జరగాలని, అవసరమైన మేరకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులకు సూచించారు. దర్శనానికి పురుషులు, మహిళలకు వేరువేరుగా ప్రవేశం కల్పించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చే నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24/7 పటిష్ట బందోబస్తు కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మర్రిచెట్టు ప్రాంతం, గోవాడ, దేవాలయ ప్రాంగణ సమీపంలో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, గిరిజన సాంప్రదాయ పూజలకు అవసరమైన పూజా సామగ్రి, విద్యుద్దీకరణ తదితర ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 350 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో 24/7 బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, నాగోబా జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. త్రాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, విద్యుత్, భోజన వసతి వంటి మౌలిక సదుపాయాలు భక్తులు, ప్రముఖులు, అధికారులకు కల్పిస్తామని తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ, జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పార్కింగ్, మరుగుదొడ్లు, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. జాతరలో నకిలీ ఆహార పదార్థాల విక్రయాన్ని అరికట్టేందుకు తనిఖీలు చేపట్టాలని, వైద్య, పోలీస్, అగ్నిమాపక, మద్యం నియంత్రణ శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం నాగోబా జాతర చరిత్ర వివరాలతో రూపొందించిన 'నాగోబా జాతర-2026' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎఎస్పీ కాజల్ సింగ్, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావు, కేస్లాపూర్ సర్పంచ్ మెస్రం తుకారాం, ఆలయ ఈఓ రవి, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీఎం పర్యటనకు అధికారులు సిద్ధంగా ఉండాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మామడ మండలం పొన్కల్ గ్రామంలో సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవం, హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి వెళ్లే వాహన శ్రేణి, సభ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవం, బహిరంగ సభ ప్రాంగణాల్లో తాగునీరు, టెంట్లు, షామియానాలు, సరిపడినన్ని కుర్చీలు, సౌండ్ సిస్టమ్, వేదిక తదితర ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. సదర్మాట్ బ్యారేజి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజి ప్రాంగణం పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం
- మంత్రి వివేక్ వెంకటస్వామి



**మందమర్రి, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటి అభివృద్ధికి పెద్దపీట వేయడంతో మున్సిపాటిని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటిలోని 3, 4, 19, 17 వార్డుల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలోని 22 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ ం చేపడుతూనే ఉన్నామని తెలిపారు. అంతేగాకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు కూడ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటి అభివృద్ధి కుంటుపడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మున్సిపాలిటిపై మున్సిపాలిటిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి పెద్ద ఎత్తున నిదులు తెచ్చానని తెలిపారు. ఓపెన్‌కాస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజల పునరావాస సౌకర్యాలు కల్పించేందుకు సింగరేణి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతేగాకుండా నిలిచిపోయినటువంటి 76వ జీఓను అమలు చేసి ఇండ్ల క్రమబద్దీకరించేందుకు రెవెన్యూ మంత్రితో మాట్లాడుతానని సింగరేణి భూముల్లో ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపడుతానన్నారు. అంతేగాకుండా మున్సిపాలిటిలోని అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం 3, 18వార్డుల్లో అభివృద్ధి పనులకు శం ఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రితో పాటు జీఎం రాధాక్రిష్ణ, జిల్లా అద్యక్షులు రఘునాథ్ రెడ్డి, కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు



**ఉట్నూర్, జనవరి 13 (ప్రభాత సమాచారం)**

ప్రజా ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి దిశగాముందుకు సాగుతున్నాయని, ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గుర్తించి సహకరించాలని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ మండలంలోని శ్యాంనాయక్ తండా, తాంద్ర గ్రామాలలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ జాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లోని సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే త్వరతిగతిన పరిష్కరిస్తామన్నారు. వేసవి కాలంలో అవసరం ఉన్న ప్రతి చోట బోర్‌లను వేస్తాం అని, అర్హులైన లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి రెండవ విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని, సీసీ రోడ్స్, డ్రైనేజీ పనులు మంజూరు చేయిస్తామన్నారు. అన్ని విధాలుగా గ్రామాల అబివృద్ధి మా లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.